మేధోపరమైన గ్రహణశక్తి, అను భవపూర్వక గ్రహణశక్తి, మరి యు అస్తిత్వపరమైన గ్రహణశక్తి. మేధోపరమైన గ్రహణశక్తి "అవు ను" అని చెబుతుంది, అది అంగీ కరిస్తుంది. అనుభవపూర్వక గ్ర హణశక్తి అనుభూతి చెందుతుం ది, అది స్పష్టంగా కనిపిస్తుంది. అస్తిత్వపరమైన గ్రహణశక్తిని కా దనలేము, అది మీ స్వభావంగా మారిపోతుంది.మీకు కేవలం మే ధోపరమైన గ్రహణశక్తి మాత్రమే ఉంటే, మీకు అన్నీ తెలుసని మీరు నమ్ముతారు. చాలామంది వేదాంతులు ఈ కోవకే చెందు తా రు. మీరు శూన్యమని మేధోపరం గా అర్థం చేసుకోగలరు, కానీ కూ ర్చుని ఆ శూన్యతను అనుభూతి చెందడం పూర్తిగా భిన్నమైనది. అనుభవపూర్వక గ్రహణశక్తి లే కపోతే, మీరు విన్నదంతా కేవలం పదాల కుప్పగానే మిగిలిపో తుం ది. అనుభవపూర్వక గ్రహణశక్తి అనేది భావోద్వేగ స్థాయిలో పరి స్థితులపై ఎక్కువగా ఆధార పడి ఉంటుంది. మీకు ఒక అనుభవం కలిగినప్పుడు, దానిని మరింత బాగా అర్థం చేసుకోవాలని మీరు కోరుకుంటారు, అందువల్ల మీరు అన్వేషకులుగా మారతారు. అస్తి త్వపరమైన గ్రహణశక్తిలో అను భవపూర్వక మరియు మేధోప రమైన గ్రహణశక్తి రెండూ ఉంటా యి. అయినప్పటికీ, అది ఈ రెం డింటినీ అధిగమిస్తుంది. అస్తి త్వపరమైన గ్రహణశక్తిని ఎలా సాధిస్తారు? దానిని సాధించడా నికి మార్గమే లేదు. పండు పండి నప్పుడు, అది కింద పడుతుంది.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ



ప్రజాదీవెన

www.prajadeevena.com

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 361 | సోమవారం | 2 నవంబర్ 2026 | పేజీలు : 04 వెల : 5

హడలెత్తిన హాస్తిన

సీఈసీని సాగనంపాల్సిందే

ప్రధాని మోదీ, అమిత్ షా కూడా చట్టపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదు
'ఓట్ బచావో.. దేశ్ బచావో' ర్యాలీలో గళమెత్తిన ఇండి కూటమి నేతలు
బీజేపీ చేస్తున్నది కేవలం ఓట్ల చోరీ కాదు.. ప్రజాస్వామ్యానికి తీరని ద్రోహం
ఎన్నికల అక్రమాలతోనే మోదీ, షా ప్రధాని, హోంమంత్రి అయ్యారు
అందరికీ అవకాశం ఉండే శివుడి బారాత్ వంటి దేశం కావాలి: రాహుల్
మోదీ గద్దె దిగాల్సిందే: ఖర్గే.. యూపీ ఎన్నికల నుంచే బీజేపీ ఔట్: అఖిలేశ్
ఢిల్లీలో భారీ ర్యాలీ.. ఒకే ఓపెన్‌టాప్ వాహనంలో నేతలు.. అనంతరం సభ
రాంలీలా మైదానంలో ఖాళీ కుర్చీలు.. ఇండి కూటమిది ప్లాప్ షో: బీజేపీ

బీజేపీ ఓట్ల చోరీ, 'సర్' పేరిట అక్రమాల్లోభాగస్వామి అయిన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ జైలుకు వెళ్లక తప్పదంటూ ఇండి కూటమి కదం తొక్కింది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా చట్టపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించింది. జ్ఞానేశ్‌కు ఉద్వాసన పలికే వరకు తమ పోరు ఆగదని స్పష్టం చేసింది. 'ఓట్ బచావో, దేశ్ బచావో' పేరిట ఆదివారం ఇండి కూటమి ఢిల్లీలో మెగా ర్యాలీ, రాంలీలా మైదానంలో సభ నిర్వహించింది.

04



మోదీ బ్యాక్ టు పెవిలియన్

మోదీని గద్దె దించేసి గుజరాత్‌కు పంపేస్తాం.. పేదల లక్ష్యంగా ఓట్ చోరీ
మరో 7 కోట్ల ఓట్లు తీసేసి దొడ్డిదారిన అధికారంలోకి రావాలని కుట్ర: రేవంత్
ఓటర్ల జాబితాలో అక్రమాలపై ఐదారేళ్లుగా రాహుల్ హెచ్చరిస్తున్నారు: భట్టి

02

రాబందుల రాజ్యంలో రావణకాష్టంగా రాష్ట్రం

రాబందు రాజ్యంలో అన్నీ బంద్..



03

దివానాగాళ్లకు ఓట్లేస్తే దివాలాతీసే రోజులొచ్చినయ్
ఆదిలాబాద్ రైతు గర్జనలో నిప్పులు చెరిగిన కేటీఆర్
కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరంపై రేవంత్ కుట్రలు
నీళ్లెత్తకుండా రైతుల పాలాలను పడావు పెట్టిండు
రైతు డిక్లరేషనని.. సెల్ఫ్ డిక్లరేషన్ అడుగుతున్నడు
ఎవుసం బంద్ పెట్టాలని ఫర్మానా జారీ చేసిండు
రైతుబంధు ఆపి.. 'రాహుల్ బంధు' కడుతున్నడు
దగా చేసినోళ్లను వంద ఫీట్ల బొందతోడి పాతిపెట్టాలె
ఇండస్ట్రియల్‌కారిడార్ పేరుతో పాయల్‌శంకర్ దోపిడీ
ఆ దొంగకు రేవంత్ తోడుదొంగ: ధ్వజమెత్తిన కేటీఆర్

కాంగ్రెస్ మూడేండ్ల పాలనలో రాష్ట్రంలో నీళ్లు బంద్, కరెంట్ బంద్, పరిశ్రమలు బంద్, చివరికి వ్యవసాయం కూడా బంద్ అయ్యే పరిస్థితి దాపురించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతుబంధు బంద్ అయింది కానీ రాహుల్‌గాంధీ బంధు మాత్రం బ్రహ్మాండంగా నడుస్తున్నదని ఎద్దేవా చేశారు.



04

వారి జీవితం మాక్ పార్లమెంట్‌లోనే!

జీవితాంతం మాక్ పార్లమెంటులోనే!!
ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అమిత్ షా ధ్వజం
విదేశీ శక్తుల ఆదేశాలతోనే ఇండి కూటమి ర్యాలీ
ఓట్ల చోరీపై ప్రత్యేక సమావేశాల్లో చర్చించండి
విపక్ష నేతలకు కేంద్ర హోం మంత్రి సవాల్
ఢిల్లీ, రోహతక్, సిమ్లాలో బీజేపీ పోటాపోటీ ర్యాలీలు


రాష్ట్రాడు ఉన్మాదికి తగిన శాస్తి

విద్యార్థినిని రంపంతో కోసిన నిందితుడు ఆస్పత్రిపాలు
ఆత్మకూరు అటవీ ప్రాంతంలో నక్కిన వైనం.. పట్టుకోడానికి వెళ్లిన పోలీసులపై దాడి.. సీఐని కత్తితో పొడిచి పారిపోయే యత్నం
6 రౌండ్లు కాల్పులు జరిపి పట్టుకున్న పోలీసులు
కాళ్లలోకి దూసుకెళ్లిన తూటాలు.. బాణసంచా కాల్చి ప్రజల సంబరాలు



02

ఎలక్ట్రిక్ రంపంతో విద్యార్థినిపై పాశవిక దాడిచేసిన ఉన్మాదికి, 24 గంటల్లోపే పోలీసులు బేడీలు వేశారు. తరగతి గదిలోకి వెళ్లి, అందరి ముందే దారుణానికి పాల్పడ్డ అతడు, తనను పట్టుకోవడానికి వచ్చిన పోలీసులపైనా దాడికి ప్రయత్నించాడు. దీంతో.. కాళ్లపై కాల్చి ఆ ఉన్మాదిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



04

తెలంగాణపై తుఫాను ముసురు

రాష్ట్రంపై మురసు తుఫాను ప్రభావం: వాతావరణ శాఖ
నేడు ఆరెంజ్.. రేపు రెడ్. ఎల్లుడి ఎల్లో అలర్ట్ జారీ

హరీష్‌పై కొత్త ఎఫ్ఐఆర్

హైకోర్టు ఆదేశాలతో సిద్దిపేటలో నమోదు
ఏ1గా హరీశ్, ఏ2గా టాస్క్‌ఫోర్స్ మాజీ బాస్ రాధాకిషన్‌రావు



03

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతోపాటు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావులపై సిద్దిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో నమోదైన ఓ కేసు విషయంలో హైకోర్టు ఆదేశాల మేరకు సిద్దిపేట పోలీసులు కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.



తెలంగాణపై తుఫాను ముసురు

రాష్ట్రంపై మురసు తుఫాను ప్రభావం: వాతావరణ శాఖ

నేడు ఆరెంజ్.. రేపు రెడ్. ఎల్లుడి ఎల్లో అలర్ట్ జారీ

ప్రజా దీవెన, హైదరాబాద్ : బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాను 'మురసు' ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమ, మంగళ, బుధవారాల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆరెంజ్, మంగళవారం రెడ్, బుధవారం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. సోమవారం ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు పడతాయని పేర్కొంది. మంగళవారం ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రెడ్ అలర్ట్ ప్రకటించింది. భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

నువ్వేం ఎస్సైవి.. ఉంటవా.. పోతవా..!

బెల్ట్‌షాపులను అరికట్టలేకుంటే వెళ్లిపో

చండూరు ఎస్సైపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆగ్రహం

ప్రజా దీవెన, చండూరు : 'ఏం ఎస్సైవి నువ్వు.. ఉంటవా.. పోతవా..? ఇక్కడ పనిచేయాలంటే ఒకటే కండీషన్.. బెల్ట్‌షాపులను కంట్రోల్ చేసేందుంటేనే ఉండు.. లేదంటే ఇక్కడ నీ అవసరం లేదు' అంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చండూరు ఎస్సై శివకుమార్‌కుఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. చండూరు మండలంలో దొంగచాటుగా నడుస్తున్న బెల్ట్‌షాపులపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ ఆయన మండిపడ్డారు. వారం రోజుల్లోగా అన్ని బెల్ట్ షాపులను మూసేయాలని ఎస్సైని ఆదేశించారు. మునుగోడు నియోజకవర్గంలో పనిచేయాలంటే బెల్ట్ షాపులను నియంత్రించడమే మొదటి షరతు అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మండలంలోని 19 గ్రామాల్లో ఎంత మంది దొంగ చాటుగా మద్యం విక్రయిస్తున్నారో లిస్టు తీసుకుని ఈనెల 10వ తేదీన తన వద్దకు రావాలని ఎస్సైని ఆదేశించారు. వాటిని ఎలా బంద్ చేయించాలో తాను చూసుకుంటానని చెప్పారు. మద్యం మహమ్మారితో గ్రామాల్లో ఎన్నో పేద కుటుంబాలు, యువత నాశనమవుతోందని.. చట్టవిరుద్ధమైన బెల్ట్ షాపులను మూయించడం సామాజిక బాధ్యతని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎస్సైకి ఫోన్ చేసి స్వయంగా మాట్లాడిన వీడియోను ఎమ్మెల్యే తన అధికారిక సామాజిక మాధ్యమాల ఖాతాల్లో పోస్ట్ చేయగా.. అది వైరల్‌గా మారింది.

ఫెర్టిలిటీ సెంటర్ల ఆర్థిక లావాదేవీల ఆరా

అండాల సేకరణ ముఠా గలీజు దందా

కోట్ల రూపాయలు కొల్లగొట్టిన ముఠా

8 మంది నిందితులు, పలు ఫెర్టిలిటీ సెంటర్ల ఆర్థిక లావాదేవీలపై ఆరా

పలు ఫెర్టిలిటీ సెంటర్ల నిర్వాహకుల.. అరెస్టుకు రంగం సిద్ధం

ప్రజా దీవెన, హైదరాబాద్ : ఇతర రాష్ట్రాల మహిళలను హైదరాబాద్‌కు అక్రమంగా తీసుకొచ్చి అండాలు సేకరించి విక్రయిస్తున్న ముఠాకు సంబంధించిన కేసు విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. హైదరాబాద్‌లో తిష్ట వేసిన ఈ ముఠా.. గత ఏడాది కాలంలో ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు చెందిన 600 నుంచి 1000 మంది మహిళలను హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా చేసినట్టు పోలీసు విచారణలో తెలిసింది. అక్రమ రవాణాకు గురైన వారిలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారే ఎక్కువ మంది ఉన్నట్టు సమాచారం. ఇక, ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది నిందితులు, ముఠాతో సంబంధం ఉన్న ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాల నిర్వాహకుల ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించిన పోలీసులు.. త్వరలో మరికొందని అరెస్టు చేయనున్నారని సమాచారం.

నిక్కత్ పర్వీన్‌కు బెంగాల్‌లో భారీ నెట్‌వర్క్

ఈ ముఠాలోని మధ్యప్రదేశ్, ఇండోర్‌కు చెందిన అమిత్ శర్మ.. అండాల సేకరణలో ప్రధాన పాత్ర పోషించగా.. మహిళల అక్రమ రవాణాలో పశ్చిమబెంగాల్‌కు చెందిన నిక్కత్ పర్వీన్ కీలక పాత్ర పోషించినట్లు పోలీసుల విచారణలో తేలింది. బెంగాల్‌కు చెందిన పర్వీన్‌కు ఆ రాష్ట్రంలో భారీ నెట్‌వర్క్ ఉంది. ఏజెంట్లు, దళారులతో యువతులు, కడు పేదరికంలో ఉన్న మహిళలు, ఒంటరి మహిళలు, బిక్షాటన చేస్తున్న మహిళలకు డబ్బు ఆశ చూపి తమ దందాలోకి తెచ్చేవారు. ఈ ఏజెంట్ల మాటలు నమ్మిన మహిళలు డబ్బు కోసం అండాలు ఇచ్చేందుకు వచ్చేవారు. అయితే, నకిలీ ఆధార్ కార్డులు సృష్టించి, వారి అనుమతితోనే అండాలు సేకరిస్తున్నట్టు పత్రాలు తయారు చేసి ఈ ముఠా దందా చేసింది. దందాపై ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ప్రతి విడతలో సుమారు 50 మంది మహిళలను హైదరాబాద్‌కు తెచ్చి.. వారిని వేర్వేరు హాస్టల్స్‌లో ఉంచేవారు. ఇందుకోసం ఒక్కో వసతి గృహానికి ఈ ముఠా రూ.50 వేలు అద్దెగా చెల్లించినట్టు తెలిసింది. ఇక, మహిళల నుంచి సేకరించిన అండాలను ఈ ముఠా.. హైదరాబాద్‌తోపాటు కర్ణాటక, గుజరాత్‌లోని నగరాలకు రవాణా చేసినట్టు పోలీసులు గుర్తించినట్టు సమాచారం. కాగా, ఈ కేసులో అరెస్టయిన నిందితుల్లో ఒకరైన పంకజ్ సోనీ.. గతంలోనూ ఇదే తరహా కేసులో అరెస్టయ్యాడు. సికింద్రాబాద్ ప్రాంతంలో రహదారిపై నిద్రించే పేదలు, బిచ్చగాళ్లకు మద్యం, బిర్యానీ ఇచ్చి వారి నుంచి వీర్యాన్ని సేకరించి ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ కేంద్రాలకు విక్రయించేవాడు.

ఆర్థిక లావాదేవీలపై ఆరా..

ముఠాకు చెందిన ఎనిమిది మందిని అరెస్టు చేసిన పోలీసులు.. వారి బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేయించారు. ఆ ఖాతాల ద్వారా జరిగిన లావాదేవీలపై దృష్టిపెట్టారు. ఓ మహిళ నుంచి సేకరించిన అండాలను రూ.3లక్షలకు విక్రయించిన నిందితులు. మహిళలకు హార్మోన్ ఇంజక్షన్‌లు ఇచ్చి పదిసార్లు అండాలు సేకరించినట్లు పోలీసులు గుర్తించారు. అంటే ఒక్కో మహిళ నుంచి సేకరించిన అండాలతో రూ.30లక్షలు కొల్లగొట్టారు. ఇలా ఏడాదిలో సుమారు 1000 మంది మహిళల నుంచి ఎన్ని అండాలు సేకరించారు..? ఎన్ని కోట్లు కొల్లగొట్టారు..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇక, ఈ ముఠాతో సంబంధమున్న ఫెర్టిలిటీ కేంద్రాలపైనా పోలీసులు దృష్టి సారించారు. సీపీ సుమతి ఆధ్వర్యంలో సాంకేతిక ఆధారాలను సేకరిస్తున్నారు. త్వరలోనే పలు ఐవీఎఫ్, ఫెర్టిలిటీ కేంద్రాలపై దాడి చేసి, ఈ ముఠాతో సంబంధమున్న వారిని అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

మోదీ బ్యాక్ టు పెవిలియన్



మోదీని గద్దె దించేసి గుజరాత్‌కు పంపేస్తాం..

పేదలను లక్ష్యంగా చేసుకొనే ఓట్ చోరీ

ఇప్పటికే 13.5 కోట్ల ఓట్లు తొలగించారు

మరో 7 కోట్ల ఓట్లు తీసేసి దొడ్డిదారిన అధికారంలోకి రావాలని కుట్ర: రేవంత్

జ్ఞానేశ్‌ను ఇంటికి పంపేసి ప్రజలకు మోదీ క్షమాపణ చెప్పాలి: మహేశ్ గౌడ్

ఓటర్ల జాబితాలో అక్రమాలపై ఐదారేళ్లుగా రాహుల్ హెచ్చరిస్తున్నారు: భట్టి

ప్రజా దీవెన, న్యూఢిల్లీ : మోదీ రావణుడు అని, ఆయన్ను గద్దె దించి.. గుజరాత్‌కు పంపేదాకా విశ్రమించేది లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మోదీని ఓడించేందుకు తెలంగాణ నుంచి కాంగ్రెస్ కార్యకర్తల రూపంలో వానరసైన్యం ఢిల్లీకి వచ్చిందన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఇండీ కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ముందు తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణులను ఉద్దేశించి రేవంత్ మాట్లాడారు. మోదీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పేద ప్రజలను లక్ష్యంగా చేసుకొని వారి ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. సీఈసీగా జ్ఞానేశ్ కుమార్‌ను నియమించి ఇప్పటికే దేశంలో 13.5 కోట్ల ఓట్లు తొలగించారని.. రానున్న రోజుల్లో మరో 7కోట్ల ఓట్లు తొలగించి.. దొడ్డిదారిన అధికారంలోకి రావాలని బీజేపీ కుట్ర పన్నుతోందని రేవంత్ ఆరోపించారు. ఓట్ చోరీ ద్వారా మహారాష్ట్ర, బిహార్, బెంగాల్‌లో ఇప్పటికే బీజేపీ లాభపడిందని విమర్శించారు.

తెలంగాణ బలాన్ని, గళాన్ని ఢిల్లీలో గట్టిగా వినిపించేందుకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో 15వేల మంది కార్యకర్తలను ప్రత్యేక రైళ్లలో తరలించేందుకు ఏర్పాట్లు చేశామని.. కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరించి, రైళ్లను రద్దు చేసిందని తీవ్రంగా ఆక్షేపించారు. "మీరు రైళ్లను ఆపగలిగారేమో కానీ, తెలంగాణ ప్రజల సంకల్పాన్ని ఆపలేకపోయారు. మా బలమైన గళం ముందు మోదీ, అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ తలవంచక తప్పదు" అని వ్యాఖ్యానించారు. ఉన్నత వర్గాలకే ఓటు హక్కు ఉండాలనేది బీజేపీ మతోన్మాద సిద్ధాంతం అని పేర్కొన్నారు. ప్రజలే పాలకులను ఎన్నుకునేందుకు అప్పట్లో 30కోట్ల జనాభాకు ఓటు హక్కును కల్పించారని వివరించారు. ఉన్నత వర్గాలకే ఓటు హక్కు ఉండాలని అప్పట్లో బీజేపీ మతోన్మాద శక్తులు వాదించాయని.. అయితే దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలకు అంబేడ్కర్ సమాన ఓటు హక్కు అందించారని తెలిపారు. మూడోసారి.. 400 సీట్లతో గనక అధికారంలోకొస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి, రిజర్వేషన్లు ఎత్తివేసి, పేదల ఓటు హక్కును తొలగించాలని మోదీ కుట్ర పన్నారని, ఆ విషయాన్ని గ్రహించిన ప్రజలు 240 సీట్లకే పరిమితం చేశారని చెప్పారు. బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రతి ఒక్క కార్యకర్త పల్లెపల్లెకూ చేరవేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ సభకు దేశంలోనే అత్యధికంగా తెలంగాణ నుంచి భారీ ఎత్తున జన సమీకరణ చేసిన మహేశ్ గౌడ్‌ను రేవంత్ ప్రత్యేకంగా అభినందించారు. కాగా ఓట్ చోరీతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోస్తూ ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షాలు చరిత్రలో ఎన్నడూ చూడని అరాచకాలకు తెరలేపారని ఆరోపించారు. మోదీ, అమిత్ షాలు సీఈసీ జ్ఞానేశ్‌ను పదవి నుంచి ఇంటికి పంపాలని, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యతగల ఎన్నికల సంఘం.. బీజేపీ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. సీఈసీ తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని స్వయంగా కమిషనర్లే పేర్కొనడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనమన్నారు. ఐదారేళ్లుగా ఓటర్ల జాబితా అక్రమాలపై రాహుల్ హెచ్చరిస్తున్నారని, ప్రతి నియోజకవర్గంలో 20 వేల నుంచి 25వేల ఓట్లు తొలగించి ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశారని ఆరోపించారు. ఓట్‌చోరీతోనే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. జాబితా నుంచి ఓట్లు తొలగిస్తున్న జ్ఞానేశ్‌కు శిక్షపడక తప్పదని మంత్రి వివేక్ అన్నారు. ఓట్ల చోరీకి పాల్పడిన వారిని కేంద్రం కాపాడుతోందని మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఈసీ జ్ఞానేశ్‌ను వెనుకేసుకొచ్చే ప్రయత్నాన్ని మోదీ మానుకోవాలని సూచించారు.

రాప్తాడు ఉన్మాదికి తగిన శాస్తి

విద్యార్థినిని రంపంతో కోసిన నిందితుడు ఆస్పత్రిపాలు

ఆత్మకూరు అటవీ ప్రాంతంలో నక్కిన వైనం.. పట్టుకోడానికి వెళ్లిన పోలీసులపై దాడి.. సీఐని కత్తితో పొడిచి పారిపోయే యత్నం

6 రౌండ్లు కాల్పులు జరిపి పట్టుకున్న పోలీసులు

కాళ్లలోకి దూసుకెళ్లిన తూటాలు.. బాణసంచా కాల్చి ప్రజల సంబరాలు



ప్రజా దీవెన, అనంతపురం : ఎలక్ట్రిక్ రంపంతో విద్యార్థినిపై పాశవిక దాడిచేసిన ఉన్మాదికి, 24 గంటల్లోపే పోలీసులు బేడీలు వేశారు. తరగతి గదిలోకి వెళ్లి, అందరి ముందే దారుణానికి పాల్పడ్డ అతడు, తనను పట్టుకోవడానికి వచ్చిన పోలీసులపైనా దాడికి ప్రయత్నించాడు. దీంతో.. కాళ్లపై కాల్చి ఆ ఉన్మాదిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'అమ్మాయిలపై చెయ్యి పడితే ఖబడ్దార్' అనే రాష్ట్ర ప్రభుత్వ హెచ్చరికను ఆచరణలో అమలుచేసి చూపారు. విషయం తెలియగానే ప్రజలు వీధుల్లోకి వచ్చి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు జడ్పీ ఉన్నతపాఠశాలలో పదో తరగతి విద్యార్థినులపై విచక్షణారహితంగా హేమంత్ దాడి చేసి పరారైన విషయం తెలిసిందే. అతడు ఆత్మకూరు అటవీప్రాంతంలో తలదాచుకున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం మధ్యాహ్నం పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. దీన్ని పసిగట్టిన హేమంత్ తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో రాప్తాడు సీఐ వెంకటేశ్వర్లుపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. అనంతరం పారిపోతున్న నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపారు. బుల్లెట్ గాయాలు తగిలి కుప్పకూలిన హేమంత్‌ను సంఘటనా స్థలం నుంచి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దట్టమైన అటవీ ప్రాంతంలో..

శనివారం రాప్తాడు జడ్పీ ఉన్నత పాఠశాలలోకి ఎలక్ట్రిక్ రంపం తీసుకుని వెళ్లిన హేమంత్ పదో తరగతి విద్యార్థినిపై భయానకంగా దాడి చేసిన సంగతి తెలిసిందే. బాలిక ముఖం, తల, వీపు భాగాలపై రంపంతో కోసి గాయపరిచాడు. అడ్డుకోబోయిన మరో విద్యార్థినిని కూడా గాయపరిచి అక్కడి నుంచి పారిపోయాడు. బైక్‌పై పారిపోయిన హేమంత్ కోసం పోలీసులు తీవ్రంగా గాలించారు. శనివారం రాత్రి తాడిపత్రి, పుట్లూరు మండలాల్లో గాలించారు. పుట్లూరు మండలంలో సంచరిస్తున్నట్లు సీసీ ఫుటేజీలో రికార్డు అయింది. ఆ తరువాత ఆదివారం మధ్యాహ్నం ఆత్మకూరు అటవీ ప్రాంతంలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసు బృందాలు అక్కడికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టాయి. నిందితుడు సాయంత్రం కనిపించగా పోలీసులు పట్టుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో నిందితుడు రాప్తాడు సీఐ వెంకటేశ్వర్లుపై కత్తితో దాడి చేశాడు. తప్పించుకుని దట్టమైన అటవీ ప్రాంతంలోకి పారిపోవాలని చూశాడు. దీంతో పోలీసులు కాల్పులు జరిపారు. నిందితుడి కాళ్లకు బుల్లెట్లు తగలడంతో కుప్పకూలిపోయాడు. పోలీసులు అక్కడి నుంచి అనంతపురం సర్వజన వైద్యశాలకు వాహనంలో తీసుకువచ్చారు. ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద వాహనం నుంచి కిందకు దించి ఎమర్జెన్సీ వార్డులోకి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపారన్న వార్త తెలియడంతో ఆసుపత్రి వద్దకు ప్రజలు భారీగా చేరుకున్నారు. దీంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. హేమంత్‌ను ఎన్‌కౌంటర్ చేసినా తప్పులేదని, ఇలాంటి వాడిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి వద్ద పోలీసులు భద్రతను పెంచి ప్రజలను కట్టడి చేశారు.

24 గంటలు.. 15 బృందాల గాలింపు

రాప్తాడు ఘటనపై సీఎం చంద్రబాబు వెంటనే స్పందించారు. దాడికి పాల్పడ్డ దుండగుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హోం మంత్రి అనిత జిల్లా ఎస్పీ జగదీశ్‌తో మాట్లాడారు. హేమంత్‌ను పట్టుకునేందుకు ఏకంగా 15 పోలీసు బృందాలు రంగంలోకి దిగారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంలతో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అనంతపురం జిల్లా పోలీసులు 24 గంటలకు పైగా శ్రమించి అటవీ ప్రాంతంలో ఉన్న నిందితుడ్ని పట్టుకున్నారు. హేమంత్‌పై పోలీసులు కాల్పులు జరిపినట్లు తెలియగానే రాప్తాడు ప్రజలు ఆదివారం రాత్రి సంబరాలు జరుపుకొన్నారు. బస్టాండు సమీపంలో టపాసులు కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. కాల్పులు జరిపిన పోలీసులను అభినందించారు.



నేడు రాష్ట్రానికి అమిత్ షా

ఏర్పాట్లను పరిశీలించిన కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావు

రాహుల్ గాంధీకి నాయకత్వ లక్షణాలు లేవు: ఈటల

ప్రజా దీవెన, హైదరాబాద్ : కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాపాదయాత్రకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఏర్పాట్లు పూర్తిచేసింది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని అరికట్టండి' నినాదంతో బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ఎంజే మార్కెట్ వరకు ఈ పాదయాత్ర సాగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు మొదలై సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. అమిత్ షాతోపాటు కేంద్ర మంత్రులు జీ కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్‌వీ సుభాష్ తెలిపారు. పాదయాత్ర మార్గాన్ని, ఏర్పాట్లను రాంచందర్‌రావు, కిషన్‌రెడ్డి ఆదివారం రాత్రి పరిశీలించారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి నాయకత్వ లక్షణాలు లేవని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. రాజ్యాంగాన్ని కాపాడాలంటూ కాంగ్రెస్ విచిత్రమైన నాటకమాడుతోందన్నారు. భారతజాతి ఆత్మగౌరవాన్ని, కీర్తిని విదేశాల్లో పలచన చేసేందుకు ప్రయత్నిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలపైకాంగ్రెస్ దాడులు చేస్తోందని ఆరోపించారు. ఆదివారం జీడిమెట్లలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సర్ ప్రక్రియ బీజేపీ మొదలుపెట్టింది కాదని, ఇప్పటివరకు 13సార్లు సర్ జరిగిందన్నారు. రాహుల్ గాంధీకి నాయకత్వం వహించే సత్తా లేదని, విదేశాల ఫండింగ్‌తో మీడియాను, సోషల్ మీడియాను మేనేజ్ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని విచ్ఛినం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

హరీష్‌పై కొత్త ఎఫ్ఐఆర్

హైకోర్టు ఆదేశాలతో సిద్దిపేటలో నమోదు

ఏ1గా హరీశ్, ఏ2గా టాస్క్‌ఫోర్స్ మాజీ బాస్ రాధాకిషన్‌రావు

ప్రజా దీవెన, హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతోపాటు టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులపై సిద్దిపేట పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో పంజాగుట్ట పోలీసుస్టేషన్‌లో నమోదైన ఓ కేసు విషయంలో హైకోర్టు ఆదేశాల మేరకు సిద్దిపేట పోలీసులు కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సిద్దిపేటకు చెందిన చక్రధర్‌గౌడ్ అనే వ్యాపారి ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్‌లో ఏ1గా హరీశ్‌రావు, ఏ2గా రాధాకిషన్‌రావును పేర్కొన్నారు. నిజానికి, తన ఫోన్లు ట్యాప్ చేసి బెదింపులకు పాల్పడుతున్నారంటూ హరీశ్‌రావు తదితరులపై చక్రధర్‌గౌడ్ 2024 డిసెంబరు 1న పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయగా.. హరీశ్‌రావు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. విషయం హైకోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు వెళ్లింది. అయితే, మరణించిన రైతు కుటుంబాలను ఆదుకోవడం, ఆర్థిక సాయం చేస్తుండడంతో ప్రజల్లో తనకు మద్దతు పెరుగుతుండగా హరీశ్ రావు తదితరులు తనను బెదిరింపులకు గురి చేశారని చక్రధర్‌గౌడ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హరీశ్ నాటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావును అడ్డం పెట్టుకుని తనని భయభ్రాంతులకు గురి చేసి తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపించారు. ఈ కేసుల్లో బెయిల్ తీసుకుని బయటకు వచ్చిన తర్వాత కేసు నమోదు చేయాలని పలుమార్లు పోలీసులను కోరినా పట్టించుకోలేదని తెలిపారు. హరీశ్‌రావు తదితరుల ఆదేశాల మేరకు తనతోపాటు తన భార్య ఫోన్లు ట్యాపింగ్ చేశారని, యాపిల్ సంస్థ నుంచి తమకు హెచ్చరిక సందేశాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ మేరకు చక్రధర్ గౌడ్ హైకోర్టును ఆశ్రయించగా.. సదరు కేసును పంజాగుట్ట నుంచి సిద్దిపేటకు బదిలీ చేసి కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేసు బదిలీ అవ్వగా.. సిద్దిపేట పోలీసులు సెక్షన్ 120బీ, 386, 409, 506, 419, 420, 467, 406 రెడ్‌విత్ 34 ఐపీసీతో పాటు 66 డీ ఐటీ యాక్ట్ 2000 కింద హరీశ్ తదితరులపై కేసు నమోదు చేశారు. పంజాగుట్టలో హరీశ్ తదితరులపై పెట్టిన సెక్షన్లకు అదనంగా పలు సెక్షన్లు జోడించారు.

కులగణనపై అసెంబ్లీ సమావేశం నిర్వహించండి

సీఎం రేవంత్‌రెడ్డికి కల్వకుంట్ల కవిత లేఖ

ప్రజా దీవెన, హైదరాబాద్ : జనగణనలో ఓబీసీ కులగణన కాలమ్ చేర్చాలని కోరుతూ ప్రత్యేకంగా శాసన సభ, శాసన మండలి సమావేశాలు చేపట్టి తీర్మానం చేయాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం ఆమె బహిరంగ లేఖ రాశారు. జన గణనలో ఆదివాసీల మతాన్ని నమోదు చేసేందుకు కూడా ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలంటూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ నుంచి ఇంటింటి జనగణన ప్రారంభమవుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం స్పందించాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా బీసీలకు జనాభా దామాషా మేరకు ఫలాలు అందడం లేదని కవిత పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఓబీసీలు ఎంతమంది ఉన్నారనే దానిపై చట్టబద్ధమైన లెక్కలు లేకపోవడంతోనే.. ఇలాంటి పరిస్థితి వచ్చిందని తెలిపారు.

జోరుమీదున్న 'యూపీఐ'

అక్టోబరులో 2,547 కోట్లుగా నమోదు.. విలువ రూ.31.53 లక్షల కోట్లు

ప్రజా దీవెన, ముంబై: యూపీఐ లావాదేవీలు జోరుగా పెరుగుతున్నాయి. మొదటిసారిగా అక్టోబరు నెలలో యూపీఐ లావాదేవీలు 2,500 కోట్ల మార్క్‌ను దాటాయి. అలాగే రోజువారీ సగటు లావాదేవీల విలువ మొదటిసారి రూ.లక్ష కోట్లను దాటడం గమనార్హం. మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) చార్జీలను విధించడంపై ఓ వైపు చర్చ జరుగుతున్న తరుణంలో ఈ స్థాయిలో డిజిటల్ చెల్లింపులు పెరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. అక్టోబరులో 2,547 కోట్ల లావాదేవీలను యూపీఐ ప్రాసెస్ చేసింది. వీటి విలువ రూ.31.53 లక్షల కోట్లు. సెప్టెంబరులో రూ.29.37 లక్షల కోట్ల విలువైన 2,407 కోట్ల లావాదేవీలు జరిగాయి. నెలవారీగా చూస్తే లావాదేవీల పరిమాణం 5.8 శాతం పెరగ్గా.. చెల్లింపుల విలువ 7.4 శాతం వృద్ధి చెందింది. రోజువారీ సగటు లావాదేవీలూ పెరిగాయి. సెప్టెంబరులో రోజువారీ సగటు లావాదేవీలు 80.2 కోట్లు ఉండగా.. అక్టోబరులో 2.5 శాతం పెరిగి 82.2 కోట్లకు చేరాయి. అలాగే రోజువారీ సగటు లావాదేవీల విలువ 3.9 శాతం వృద్ధితో రూ.97,913 కోట్ల నుంచి రూ.1,01,707 కోట్లకు చేరుకున్నాయి. వార్షిక ప్రాతిపదికన అక్టోబరులో లావాదేవీల పరిమాణం 23 శాతం పెరిగింది. విలువ వృద్ధి మాత్రం 18 శాతం నుంచి 16 శాతానికి తగ్గింది.

రాబందుల రాజ్యంలో రావణకాష్టంగా రాష్ట్రం

రాబందు రాజ్యంలో అన్నీ బంద్..

దివానాగాళ్లకు ఓట్లేస్తే దివాలాతీసే రోజులొచ్చినయ్

ఆదిలాబాద్ రైతు గర్జనలో నిప్పులు చెరిగిన కేటీఆర్

కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరంపై రేవంత్ కుట్రలు

నీళ్లెత్తకుండా రైతుల పాలాలను పడావు పెట్టిండు

రైతు డిక్లరేషనని.. సెల్ఫ్ డిక్లరేషన్ అడుగుతున్నడు

ఎవుసం బంద్ పెట్టాలని ఫర్మానా జారీ చేసిండు

రైతుబంధు ఆపి.. 'రాహుల్ బంధు' కడుతున్నడు

మంచి చేసినోళ్లను ఎప్పటికీ గుండెల్లో పెట్టుకోవాలె

దగా చేసినోళ్లను వంద ఫీట్ల బొందతోడి పాతిపెట్టాలె

ఇండస్ట్రియల్‌కారిడార్ పేరుతో పాయల్‌శంకర్ దోపిడీ

ఆ దొంగకు రేవంత్ తోడుదొంగ: ధ్వజమెత్తిన కేటీఆర్



ప్రజా దీవెన, హైదరాబాద్ : కాంగ్రెస్ మూడేండ్ల పాలనలో రాష్ట్రంలో నీళ్లు బంద్, కరెంట్ బంద్, పరిశ్రమలు బంద్, చివరికి వ్యవసాయం కూడా బంద్ అయ్యే పరిస్థితి దాపురించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతుబంధు బంద్ అయింది కానీ రాహుల్‌గాంధీ బంధు మాత్రం బ్రహ్మాండంగా నడుస్తున్నదని ఎద్దేవా చేశారు. 'దివానాగాళ్లకు ఓట్లేస్తే దివాలాతీసే రోజులు వచ్చినయ్.. నాడు రాహుల్‌గాంధీని తీసుకొచ్చి రైతు డిక్లరేషన్ ఇచ్చిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు సాగుచేసే పంటలకు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని రైతులకు ఫర్మానా జారీ చేసి మరణశాసనం రాస్తున్నడు' అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ సర్కార్ వైఫల్యంతో రాష్ట్రంలో అన్ని రంగాల్లో సంక్షోభం తాండవిస్తున్నదని తూర్పారబట్టారు. 'కేసీఆర్‌పై కక్షతో కల్పతరువులాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన్రు.. నీళ్లెత్తకుండా రైతుల పొలాలను ఎండబెట్టిన్రు' అంటూ నిప్పులు చెరిగారు. ఆదిలాబాద్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన రైతుగర్జన సభకు హాజరైన కేటీఆర్.. అశేషంగా తరలివచ్చిన రైతులనుద్దేశించి ప్రసంగించారు. ఎన్నికల ముందు వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియోలను చూపుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

అదే విధంగా డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ గొప్పలు చెబుతున్న బీజేపీపై దుమ్మెత్తిపోశారు. ఢిల్లీలో హమ్మా ప్రభుత్వం ఉంటే, తెలంగాణలో జుమ్లా సర్కార్ నడుస్తున్నదని తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. ఆదిలాబాద్‌లో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నా జిల్లాకు ఒరిగిందేందని సూటిగా ప్రశ్నించారు. ఆదిలాబాద్ కవుల రచనలు, గాయకుల పాటలను గుర్తుచేస్తూ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన మూడు విడతల రైతుబంధుతో పాటు యాసంగి పంటకు ఇవ్వాల్సిన పెట్టుబడి సాయాన్ని కలిపి ఎకరానికి రూ.60 వేల చొప్పున వెంటనే చెల్లించాలని, ప్రతి రైతు ఖాతాలో ఆ మొత్తం జమ చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

రైతు డిక్లరేషన్ పేరుతో దగా

రైతు డిక్లరేషన్ పేరిట అడ్డగోలుగా హామీలిచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేండ్లయినా చేసిందేమీ లేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఎకరాకు రూ.15వేల రైతుబంధు అందిందా? రూ.2లక్షల రుణమాఫీ జరిగిందా? రూ.500 బోనస్ దక్కిందా? 34 హామీల్లో ఒక్కటైనా అమలైందా? అని సభికులను ప్రశ్నించగా 'లేదు.. లేదు' అని గట్టిగా సమాధానాలిచ్చారు. రూ.15వేల రైతుబంధు దేవుడెరుగు కనీసం రైతుకు యూరియా బస్తా ఇచ్చే దిక్కులేకుండా పోయిందని ఆయన దుయ్యబట్టారు. నాడు రేవంత్‌రెడ్డి రైతుబంధుపై 'మేమేమన్నా దివానగాళ్లమా' అని మాట్లాడిన వీడియోను చూపుతూ విమర్శలు కురిపించారు. స్వయంగా ముఖ్యమంత్రే క్రాప్ హాలిడే ప్రకటించి పంటలు వేస్తే జుర్మానా వేస్తానని ఫర్మానా జారీ చేయడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు. రైతు బాగుండాలని కేసీఆర్ 70లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.73 వేల కోట్లు వేసి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు.

కరువుకు కల్పతరువే కాళేశ్వరం

కేసీఆర్‌పై కక్షతో కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కరువుకు కల్పతరువు అయిన కాళేశ్వరాన్ని వినియోగించుకోకుండా లక్ష క్యూసెక్కుల నీటిని వృథాగా వదిలేశారని ధ్వజమెత్తారు. 'కాళేశ్వరం వాడుకోవాలని మేం చెప్పినా ఈ రేవంత్‌రెడ్డి వినకుండా.. వీళ్ల రక్తం పంట పొలాలల్లో చల్లాలె, చల్లితే పంటలు పండుతయ్ అని పనికిమాలిన మాటలు మాట్లాడిండు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్కార్ నిర్లక్ష్యం చేసి శ్రీశైలం, కన్నెపల్లి వద్ద నీళ్లెత్తకపోవడం వల్ల వానకాలంలో 35 లక్షల ఎకరాలు నష్టం జరిగి రైతులు రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కౌలు రైతులకు రైతుబంధు ఏది?

'కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతుబంధు ఇస్తానంటూ 21 లక్షల మంది కౌలు రైతులకు రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. రైతులకు ఇచ్చినట్టే కౌలు రైతులకు నాలుగు పంటల రైతుబంధును, ఎగ్గొట్టిన మూడు సీజన్ల మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నెలకు రూ.వెయ్యి ఇస్తామని హామీ ఇచ్చి దగా చేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా రైతు కూలీల బ్యాంకు ఖాతాల్లో 36 నెలల పైసలు వేయాలని డిమాండ్ చేశారు.

పాయల్ శంకర్, రేవంత్ తోడు దొంగలు..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తోడు దొంగలని కేటీఆర్ విమర్శించారు. ఇండస్ట్రియల్ కారిడార్ పేరిట పాయల్ శంకర్, ఆయన కుటుంబ సభ్యులు సిగ్గు లేకుండా దోపిడీ చేస్తున్నారంటూ ఆరోపించారు. ఈ సందర్భంగా 'లచ్చులో లచ్చన్న ఈ లుచ్చాగాళ్ల రాజ్యంలో బిచ్చగాళ్ల బతుకులాయే లచ్చులో లచ్చన్న' అంటూ ఆదిలాబాద్ జిల్లా ముద్దు బిడ్డ మహాకవి గూడ అంజన్న రాసిన పాటను గుర్తు చేశారు. బీజేపీ మోసగాళ్ల ఉచ్చులో పడి ఆదిలాబాద్ గోస పడుతున్నదంటూ మండిపడ్డారు.

బడే భాయ్.. చోటే భాయ్ దొందూదొందే..

బడే భాయ్.. చోటే భాయ్ దొందూదొందేనని కేటీఆర్ ఫైర్ అయ్యారు. 'బడే భాయ్ చెప్పిన 15లక్షలు రాలే.. చోటే భాయ్ చెప్పిన 15వేలు రాలే. చోటే భాయ్ సోయా కొనడు. బడే భాయ్ పత్తి కొనడు. చోటే భాయ్ యూరియా యాప్ పెట్టిండు. బడే భాయ్ కిసాన్ కపాస్ యాప్ పెట్టిండు. ఇద్దరు ఝూటే మనుషులే. కాంగ్రెస్.. బీజేపీ దొందూదొందే'నని దుయ్యబట్టారు. మాట్లాడితే డబుల్ ఇంజిన్.. డబుల్ ఇంజిన్.. అంటరు. ఏం డబుల్ ఇంజిన్. అయితే జుమ్లా.. లేదంటే హమ్లా తప్ప డబుల్ ఇంజిన్ లేదు. మన్నూలేదు. ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే బీజేపీనే.. ఎంపీ బీజేపీనే. సీసీఐ ఫ్యాక్టరీని ఎందుకో తెరుస్తలేరు. సీసీఐ ఎందుకో తుక్కు కింద అమ్ముతున్నరు. మా జోగు రామన్నకున్న ఫికర్ ఎమ్మెల్యే శంకర్‌కు ఎందుకు లేదు' అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ సీసీఐని అమ్ముతూ.. వైజాగ్ స్టీల్‌ను పునరుద్ధరిస్తున్నారని ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఉంటే.. సీసీఐని ఎలా అమ్ముతావంటూ గల్లా పట్టి ప్రశ్నించేవాళ్లమని చెప్పారు.

బీజేపీకి ఓటేస్తే ఏమైనా లాభం జరిగిందా?

బీజేపీకి ఓటు వేయడం వల్ల ఈ మూడేండ్లల్లో ఏమైనా లాభం జరిగిందా? అని ఆలోచించాలని రైతులకు కేటీఆర్ సూచించారు. ఎంపీని.. ఎమ్మెల్యేను గెలిపిస్తే ఏమైనా లాభం జరిగిందా? అన్నది రైతులు ఆలోచించాలని కోరారు. తెలంగాణకు మోదీ ఏం చేసిండని ప్రశ్నించారు. 'మోదీ 13 ఏండ్ల నుంచి ప్రధాన మంత్రిగా ఉన్నడు. తెలంగాణకు ఏం చేసిండని.. ఏమిచ్చిండని నిలదీశారు. 'ఒక్క మెడికల్ కాలేజీ ఇచ్చిండా? ఒక్క నర్సింగ్ కాలేజీ ఇచ్చిండా? నవోదయ పాఠశాల ఇచ్చిండా? ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చిండా? ఒక్క జాతీయ ప్రాజెక్ట్ ఇచ్చిండా?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రజలు బీజేపీకి ఎందుకు ఓటు వేయాలి? ఎందుకు నమ్మాలని నిలదీశారు.

రేవంత్‌రెడ్డికి హాలిడే చెప్పేద్దాం..

రాష్ట్రంలో హాలిడేల రాజ్యం నడుస్తున్నదని కేటీఆర్ ఆరోపించారు. 'ఫీజు రీయింబర్స్‌మెంట్ హాలిడే.. పవర్ హాలిడే. కన్‌స్ట్రక్షన్ హాలిడే.. ఇండస్ట్రీ హాలిడే. ఐటీకి హాలిడే. రైతుబంధుకు హాలిడే. మొత్తం హాలిడే రాజ్యం నడుస్తున్నది. అసలు ఈ హాలిడేస్ ఏందుకు.. రేవంత్‌రెడ్డికే శాశ్వతంగా హాలిడే చెప్పే రోజులు ముందున్నాయి. మళ్లీ కేసీఆర్‌ను ఎత్తుకుంటే.. ముఖ్యమంత్రిని చేస్తే మళ్లీ ప్రశాంతత వస్తుంది. ఈ దిశగా రైతులు ఆలోచించాలి' అని కేటీఆర్ కోరారు.

ఎలుకల వల్ల ఏడుగురు పిల్లలు చనిపోయిన్రట

ఆదిలాబాద్ రిమ్స్‌లో ఏడుగురు పిల్లలు మృత్యువాతపడిన ఘటనను ప్రస్తావించిన కేటీఆర్ సర్కార్ వైఫల్యంపై నిప్పులుచెరిగారు. చిన్నారుల మరణానికి ఎలుకలు కారణమని ప్రభుత్వం చెప్పడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'ఎలుకల వల్ల ఏడుగురు పిల్లలు చనిపోయిన్రట. ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి ఉంటుందా? వాళ్ల ప్రాణాలను ఎవరు తెచ్చిస్తారని' అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'రాష్ట్రాన్ని నల్లమల పిల్లి నడుపుతున్నది. ఆ నల్లమల పిల్లికి ఎలుకలు పట్టడం చాతనైతలేదా?' అంటూ ప్రశ్నించారు. ఎలుకలు పట్టలేని వారు ముఖ్యమంత్రిగా ఉండి దేనికని నిలదీశారు. ఒక్కో కుటుంబానికి రూ.25లక్షల పరిహారం ఇవ్వాలని జోగు రామన్న డిమాండ్ చేసినా సీఎం నోరెత్తడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

యాదగిరి నృసింహుడి దివ్యసన్నిధిలో వేద స్వస్తి

వందలాది మంది వేద విద్యార్థులు, పండితుల మంత్ర ఘోష

ప్రజా దీవెన, యాదాద్రి, నవంబరు 1 : లోకకల్యాణం, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో 'వేదస్వస్తి' మహోత్సవం ఘనం గా జరిగింది. గర్భాలయ ముఖమండపంలో 550 మంది వేద విద్యార్థులు, గురువులు, వేదపండితుల ఏకకాల చతుర్వేద మంత్రపఠనాలతో ఆలయ ప్రాంగణమంతా వేదనాదంతో మార్మోగింది. స్వామివారి దర్శనానికి వచ్చిన వేలాదిమంది భక్తులు వేదఘోషను ఆలకిస్తూ, ఆధ్యాత్మిక అనుభూతికి లోనయ్యారు. మరోవైపు లక్ష్మీనృసింహులను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు పోటెత్తారు. 42వేల మందికిపైగా భక్తులు తరలిరాగా, దర్శనానికి దాదాపు 3గంటల సమయం పట్టింది.



విదేశీ శక్తులతో కలిసి కాంగ్రెస్ కుట్రలు

సర్ ప్రక్రియ సహేతుకమని సుప్రీం కోర్టు చెప్పింది

అరాచక శక్తుల కుట్రలను ప్రజలకు వివరిస్తాం: సంజయ్

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం: అర్వింద్

ప్రజా దీవెన, కరీంనగర్ : విదేశీ శక్తులతో కలిసి కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని దెబ్బతీసేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారంకరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. విదేశీ శక్తులు, విదేశీ ఆర్థిక సాయంతో పెట్టిన బొద్దింక పార్టీ వాళ్లతో, నేహా బోరా వంటి అరాచక శక్తులతో కాంగ్రెస్ కలిసి కుట్రలు చేస్తోందన్నారు. అరాచక శక్తుల కుట్రలను ప్రజలకు వివరించేందుకు బీజేపీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 40 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్‌లో ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్ ప్రక్రియ సహేతుకమని స్వయంగా సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్రకు సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవేళ్ల, మెదక్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి నలుగురు బీజేపీ ఎంపీలు జన సమీకరణ చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 5న కరీంనగర్‌లో నిర్వహించే మహాపాద యాత్రలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొంటారని చెప్పారు. మహాపాదయాత్రకు 50 వేల మంది వచ్చేలా ఏర్పాట్లు చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అధికారం ఖాయమని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీకి ఏ పార్టీతో పొత్తు అవసరం లేదని చెప్పారు. అమృత్ 2.0లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ జగిత్యాలలో పనులు ప్రారంభించలేదన్నారు. హైదరాబాద్‌లో సోమవారం తలపెట్టిన అమిత్ షా పర్యటనను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఢిల్లీలో షాపులను మూసేయించింది బీజేపీనే

బీజేపీ వల్ల ఢిల్లీ వ్యాపారులు నష్టపోయారు: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో బీజేపీనే ఆదివారం వ్యాపారుల చేత బలవంతంగా షాపులు మూయించిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ వల్లే స్థానిక వ్యాపారులు నష్టపోయారని చెప్పారు. వాస్తవానికి ఇండియా కూటమి ర్యాలీకి తరలివచ్చే లక్షలాది మందిని ఢిల్లీలో షాపింగ్ చేయవలిసిందిగా తాను పిలుపునిచ్చానని రాహుల్ అన్నారు. తద్వారా స్థానిక వ్యాపారులకు మేలు చేసినట్లు అవుతుందని భావించామన్నారు. కానీ, తాము ఆదివారం కన్నాట్ ప్లేస్‌కు వెళ్లే సరికి షాపులన్నీ మూసేసి ఉన్నాయని, బీజేపీ వాళ్లే షాపులు మూయించినట్లు అక్కడివారు చెప్పారని ఆయన తెలిపారు. ర్యాలీకి ముందు సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియోలో రాహుల్ ఈ విషయాన్ని చెప్పారు.

రాహుల్ గాంధీతో దేశంలో అరాచకత్వం

బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దేశంలో అరాచకత్వాన్ని సృష్టిస్తున్నారని, దీన్ని ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. నవంబరు 1వ తేదీ కాంగ్రెస్ పశ్చాత్తాపం వ్యక్తం చేసి, ప్రాయశ్చిత్తం చేసుకోవలసిన రోజు అని, రాజకీయ ప్రదర్శనలు చేసే రోజు కాదని విమర్శించారు. 1984 నవంబరు 1న జరిగిన సిక్కుల ఊచకోతకు కాంగ్రెస్ ఇప్పటికీ క్షమాపణ చెప్పలేదన్నారు. వరుస ఎన్నికల్లో ఓడిపోవడంతో రాజ్యాంగ సంస్థలు, ఎన్నికల సంఘంపై నిరాధార ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ఇండియా కూటమి ర్యాలీకి కౌంటర్‌గా ఆదివారం నితిన్ నబీన్ నాయకత్వంలో హరియాణాలోని రోహతక్‌లో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి– అరాచకత్వాన్ని నిర్మూలించండి' పేరిట పాదయాత్ర నిర్వహించారు. రాజ్యాంగాన్ని ముక్కలు చేసింది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. సర్ ప్రక్రియలో ఓట్లు తొలగించినవారిలో 3 కోట్ల మంది చొరబాటుదారులు ఉన్నారని, దేశంలోని 140 కోట్ల మంది ప్రజలపై విశ్వాసం లేని కాంగ్రెస్.. చొరబాటుదారులను నమ్ముకుందని విమర్శించారు.

మణిపుర్‌లో ఐదుగురు కుకీ యువకుల దారుణ హత్య

ఇంఫాల్: మణిపుర్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. రెండు ప్రత్యర్థి సాయుధ గ్రూపుల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు కుకీ యువకులు మృతి చెందగా.. మూడు రోజుల క్రితం అదృశ్యమైన మరో ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. కెక్రోనాగ గ్రామంలో శనివారం ఉదయం రెండు గ్రూపుల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో గ్రామ వాలంటీర్లుగా పనిచేస్తున్న ముగ్గురు కుకీ యువకులు మృతిచెందారు. మరోవైపు కాంగ్‌పోక్సి జిల్లాలో మూడు రోజులుగా అదృశ్యమైన ఇద్దరు కుకీ యువకుల మృతదేహాలు పక్క జిల్లాలో గోనె సంచుల్లో దొరికాయి.

రూ.10 పెరిగిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

న్యూఢిల్లీ : దీపావళి వేళ వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగాయి. 19కిలోల ఎల్‌పీజీ వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను రూ.10 మేర పెంచుతూ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. దీంతో వరుసగా రెండో నెల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను పెంచినట్టు అయింది. చమురు సంస్థలు వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను అక్టోబరు 1న రూ.62.50పైసలు మేర పెంచాయి. దాంతో హైదరాబాద్‌లో సెప్టెంబరులో రూ.2,996గా ఉన్న 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర అక్టోబరు 1న రూ.3,065కి పెరిగింది. ఇప్పుడు మరో రూ.10 పైగానే భారం పడనుంది. మరోపక్క, ఏటీఎఫ్(ఏవియేషన్ టర్బైన్ ఫ్యుయల్) ధర లీటరుకు రూ.1.37 పైసలు మేర చమురు సంస్థలు పెంచాయి.

వాట్సాప్‌లో ఈపీఎఫ్‌వో వివరాలు!

బ్యాలెన్స్, పాస్‌బుక్ సమాచారం ఇక ఫోన్లోనే

న్యూఢిల్లీ : ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) చందాదారులు తమ బ్యాలెన్స్ చూసుకోవాలంటే పోర్టల్‌లో లాగిన్ కావాల్సిన అవసరం లేదు. ఇకపై వాట్సాప్ ద్వారా ఫోన్‌లోనే బ్యాలెన్స్, పాస్‌బుక్ వివరాలను తెలుసుకోవచ్చు. ఉద్యోగులు సాధారణ పీఎఫ్ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరాన్ని తగ్గించే లక్ష్యంతో ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ఈ కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఆదివారం ఈ సేవలను ప్రారంభించారు. ఈపీఎఫ్‌వో 74వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మరో కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. వెయ్యి రూపాయలు లేదా అంతకంటే తక్కువ నిల్వ ఉన్న అర్హత కలిగిన క్రియారహిత పీఎఫ్ ఖాతాలను ఆటోమేటిక్‌గా సెటిల్ చేయనున్నారు. ఈపీఎఫ్‌వో ధ్రువీకరించిన వాట్సాప్ సేవ ద్వారా సభ్యులు తమ పీఎఫ్ ఖాతాలోని మొత్తం నిల్వ, ఇటీవల జరిగిన ఐదు లావాదేవీలు, పీఎఫ్ పాస్‌బుక్ సమాచారం తెలుసుకోవచ్చు. ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై)కు సంబంధించిన ప్రక్రియలను పూర్తి చేయడంలోనూ సహాయం పొందవచ్చు. మరోవైపు పీఎఫ్ ఖాతాల్లో చిన్న మొత్తాలు ఉండిపోయి, క్రియారహితంగా మారిన ఖాతాదారులకు కూడా ఈపీఎఫ్‌వో ఊరటనిచ్చింది. ఆధార్ ధ్రువీకరణ పూర్తయి, వెయ్యి రూపాయలు లేదా అంతకంటే తక్కువ నిల్వ ఉన్న క్రియారహిత ఖాతాలను ఆటోమేటిక్‌గా సెటిల్ చేయనున్నారు. ఇందు కోసం ఖాతాదారులు వ్యక్తిగతంగా క్లెయిమ్ దాఖలు చేయాల్సిన అవసరం ఉండదు. నిర్దేశిత గుర్తింపు, బ్యాంకు ఖాతా ధ్రువీకరణ అనంతరం ఈపీఎఫ్‌వో స్వయంగా సెటిల్‌మెంట్ ప్రక్రియను చేపడుతుంది. ఈ ఆటోమేటిక్ సెటిల్‌మెంట్ విధానం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు లక్ష ఖాతాలకు ప్రయోజనం కలగనుంది. ఆయా ఖాతాల్లో దాదాపు రూ.5 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. ఈపీఎఫ్‌వో 74 ఏళ్ల ప్రస్థానంలో కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కేంద్ర మంత్రి మాండవీయ పేర్కొన్నారు. సంస్థలో 8 కోట్ల మందికి పైగా సభ్యుల భాగస్వామ్యంతో రూ.32లక్షల కోట్ల నిధి సమకూరిందన్నారు. చందాదారుల అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను వినియోగించుకోవాలని, సేవల్లో మరిన్ని మార్పులు తీసుకురావాలని అధికారులకు సూచించారు.

తలచుకుంటే 10 నిమిషాల్లో అణు కేంద్రాల ధ్వంసం

ఇరాన్‌లో ఇంకా ఒకట్రెండు లక్ష్యాలు మిగిలి ఉన్నాయి: ట్రంప్

వాషింగ్టన్ : తాము తలచుకుంటే పది నిమిషాల్లో ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. ఇప్పటికే ఇరాన్ అణుశక్తిని చాలా వరకు దెబ్బతీశామని, ఇంకా తమ లక్ష్యాల్లో ఇరాన్‌లోని పికాక్సీ పర్వత ప్రాంతం కూడా ఉందని తెలిపారు. ఒకవేళ అమెరికా దాడికి దిగితే వెంటనే తీవ్రంగా ప్రతిస్పందించాలని.. ఎలాంటి భౌగోళిక పరిమితులు పెట్టుకోకుండా శత్రు స్థావరాలను నాశనం చేయాలని సైన్యానికి ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తాబా ఖమేనీ ఆదేశించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఫ్లోరిడాలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇరాన్‌లో ఇంకా ఒకట్రెండు అణుకేంద్రాలు మిగిలి ఉన్నాయి. తలచుకుంటే వాటిని పది నిమిషాల్లో ధ్వంసం చేయగలం' అని చెప్పారు. ఇరాన్‌పై దాడి చేయబోతున్నారా అని ప్రశ్నించగా.. అది తెలివి తక్కువ ప్రశ్న అని, తాను దాడి చేయాలనుకుంటే, చెప్పి చేస్తానా అని అన్నారు. ఇరాన్ నాయకత్వంతో చర్చలు జరుగుతున్నాయని, కానీ వాళ్లను నమ్మలేమన్నారు. కాగా, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు ట్రంప్ ఫోన్ చేసి మాట్లాడారు. ఇరాన్‌పై స్వల్ప సమయంలోనే భారీస్థాయి లో విరుచుకుపడి.. కీలక లక్ష్యాలను దెబ్బతీసే దిశ గా ఇరువురు చర్చలు జరిపినట్టుగా సమాచారం.

హడలెత్తిన హస్తిన

ప్రధాని మోదీ, అమిత్ షా కూడా చట్టపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదు

'ఓట్ బచావో.. దేశ్ బచావో' ర్యాలీలో గళమెత్తిన ఇండి కూటమి నేతలు

బీజేపీ చేస్తున్నది కేవలం ఓట్ల చోరీ కాదు.. ప్రజాస్వామ్యానికి తీరని ద్రోహం

ఎన్నికల అక్రమాలతోనే మోదీ, షా ప్రధాని, హోంమంత్రి అయ్యారు

అందరికీ అవకాశం ఉండే శివుడి బారాత్ వంటి దేశం కావాలి: రాహుల్

మోదీ గద్దె దిగాల్సిందే: ఖర్గే.. యూపీ ఎన్నికల నుంచే బీజేపీ ఔట్: అఖిలేశ్

ఢిల్లీలో భారీ ర్యాలీ.. ఒకే ఓపెన్‌టాప్ వాహనంలో నేతలు.. అనంతరం సభ

రాంలీలా మైదానంలో ఖాళీ కుర్చీలు.. ఇండి కూటమిది ఫ్లాప్ షో: బీజేపీ



న్యూఢిల్లీ : బీజేపీ ఓట్ల చోరీ, 'సర్' పేరిట అక్రమాల్లోభాగస్వామి అయిన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ జైలుకు వెళ్లక తప్పదంటూ ఇండి కూటమి కదం తొక్కింది. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా చట్టపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించింది. జ్ఞానేశ్‌కు ఉద్వాసన పలికే వరకు తమ పోరు ఆగదని స్పష్టం చేసింది. 'ఓట్ బచావో, దేశ్ బచావో' పేరిట ఆదివారం ఇండి కూటమి ఢిల్లీలో మెగా ర్యాలీ, రాంలీలా మైదానంలో సభ నిర్వహించింది. ఇండి కూటమి నేతలంతా ఇందులో పాల్గొని బీజేపీ ఓట్ల చోరీపై తీవ్రస్థాయిలో గళమెత్తారు. ఆదివారం మధ్యాహ్నం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం నుంచి ప్రతిపక్ష నేతలు మింటో రోడ్, కన్నాట్ ప్లేస్ జంక్షన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల దూరంలోని రాంలీలా మైదానం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రతిపక్ష నేతలంతా ఒకే ఓపెన్ టాప్ వాహనంలో ప్రయాణించారు. దేశం నలుమూలల నుంచి కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్షాల నేతలు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. 'ఓటు దొంగలు గద్దె దిగాలి. ఓటును కాపాడండి.. దేశాన్ని రక్షించండి' అంటూ నినాదాలు చేశారు. వారంతా చేరుకోవడంతో రాంలీలా మైదానం నిండిపోయింది.మైదానం వెలుపల కూడా పెద్ద సంఖ్యలో జనం నిలిచిపోయారు. పది లక్షల మంది వస్తారని ప్రతిపక్షాల నేతలు చెప్పినప్పటికీ.. రెండు లక్షల మంది వరకు వచ్చినట్టు అంచనా వేస్తున్నారు. మెగా ర్యాలీకి సారథ్యం వహించిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, ప్రియాంకా గాంధీ, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా, సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే, తృణమూల్ చీఫ్ మమతా బెనర్జీ, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ తదితరులు సభలో ప్రసంగించారు.

మోదీ ప్రభుత్వం గద్దె దిగాలి: ఖర్గే

పోలీసులు, సీబీఐ, ఈడీ వంటి సంస్థలను చూపి బెదిరిస్తే.. ఇండి కూటమి బెదిరిపోదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఓట్ల చోరీ ద్వారా బీజేపీ ప్రజలను విడదీయాలని చూస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపినప్పుడే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలుగుతామని, 'మోదీని తొలగించాలి.. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి' అని పిలుపునిచ్చారు. ఇండి కూటమి పక్షాలతో పాటు పౌర సమాజం, విద్యార్థులు కూడా ఈ ర్యాలీలో పాల్గొన్నారని కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు.

ఫ్లాప్ షో: బీజేపీ

రాంలీలా మైదానంలో ఇండి కూటమి సభ ఒక ఫ్లాప్ షో అని బీజేపీ విమర్శించింది. సభకు 10 లక్షల మంది వస్తారని కాంగ్రెస్ నేతలు గొప్పలు చెప్పుకున్నారని, తీరా చర్చీస్త మైదానమంతా ఖాళీ కుర్చీలతో దర్శనమిచ్చిందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా, కేంద్ర మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. రాంలీలా మైదానంలో వేసిన 28 వేల కుర్చీల్లోనే దాదాపు 7 వేల కుర్చీలు ఖాళీగా ఉన్నాయని, ట్రిక్ ఫోటోగ్రఫీ ద్వారా కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాలు జరిగితే, ఇప్పుడు ఆయన అనుభవిస్తున్న ప్రతిపక్ష నేత పదవి, ఆయన కూటమి ఎంపీల పదవులు కూడా అక్రమమేనని పేర్కొన్నారు.

కేవలం ఓట్ల చోరీ కాదు.. ప్రజాస్వామ్యానికి ద్రోహం: రాహుల్

దేశంలో జరుగుతున్నది సాధారణ ఓట్ల చోరీ కాదని.. అది ప్రజల గొంతుకను దొంగిలించడమని, ప్రజాస్వామ్యానికి జరుగుతున్న ద్రోహమని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్, హరియాణా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లోనే కాదు.. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. ఈవీఎంల ద్వారా, ఓటర్ల జాబితాల్లో పేర్లు తొలగించడం, చేర్చడం ద్వారా అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌ను పదవి నుంచి తొలగించడమే దేశాన్ని సరైన దారిలోకి తీసుకెళ్లే తొలి అడుగు అని పేర్కొన్నారు. 2024 ఎన్నికల తర్వాత 15 శాతం భారతీయ ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని.. దీనివల్ల మొత్తం ఎన్నికల ప్రక్రియే ప్రహసనంగా మారిందని పేర్కొన్నారు. ఎన్నికల అక్రమాల ద్వారానే మోదీ, షా ప్రధాని, హోంమంత్రి అయ్యారని ఆరోపించారు. ప్రధాని మోదీ ఎక్కడికీ వెళ్లరని అమిత్ షా అంటున్నారని, మోదీ పదవి వదిలి పారిపోవాలనుకున్నా తాము వదిలిపెట్టే ప్రసక్తే లేదని... జ్ఞానేశ్ తర్వాత మోదీనే వెంటాడుతామని చెప్పారు. ఇక కులం, మతం, వర్గం, ఆర్థిక, సామాజిక నేపథ్యంతో సంబంధం లేకుండా దేశంలో అందరికీ సమాన అవకాశాలు లభించాలని పేర్కొంటూ 'శివుడి బరాత్'ను రాహుల్ గాంధీ ప్రస్తావించారు. "శివుడి బరాత్ గురించి అంతా వినే ఉంటారు. అందులో ఎలాంటి బేధం లేకుండా ఎవరైనా పాల్గొనవచ్చు. ఆ తాండవంలో ఎవరైనా నృత్యం చేయవచ్చు. ఎవరైనా అక్కడికి వెళ్లవచ్చు. మాకు అలాంటి భారతదేశమే కావాలి. అదానీ వంటి ఎవరో కొందరు వ్యక్తులకే అన్నీ సొంతమయ్యే దేశం కాదు. అలాంటి దేశాన్ని మేం కోరుకోవడం లేదు" అని వ్యాఖ్యానించారు.

ప్రజాస్వామ్యాన్ని లూటీ చేశారు: మమతా బెనర్జీ

బెంగాల్‌లో తమ పార్టీ ఓడిపోలేదని, ఓట్ల చోరీతో బీజేపీ గెలిచిందని తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. బీజేపీ నేతలు దేశ రాజ్యాంగాన్ని దెబ్బతీసి, ప్రజాస్వామ్యాన్ని లూటీ చేశారని ఆరోపించారు. మహిళల గౌరవం దెబ్బతీశారని, ఆఖరికి దేవుడి చందాలను కూడా దొంగతనం చేశారని విమర్శించారు. మోదీ గద్దె దిగాల్సిందేనని, బెంగాల్‌లో బీజేపీకి గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు.

శకునిలా సీఈసీ జ్ఞానేశ్: తేజస్వీ యాదవ్

రాంలీలా మైదానంలో సంప్రదాయంగా రామాయణం జరుగుతుందని, ఇప్పుడు ఓట్లు చోరీ చేసిన వారిపై తాము కురుక్షేత్ర యుద్ధం మొదలుపెట్టామని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ చెప్పారు. సీఈసీ జ్ఞానేశ్ మోదీ కీలుబొమ్మగా వ్యవహరిస్తున్నారని.. శకునిలా మారిపోయారని ఆరోపించారు. శకుని మోసపూరిత ఆట ఆడటంతోనే తాము యుద్ధం చేయక తప్పడం లేదని పేర్కొన్నారు.

యూపీ నుంచే బీజేపీ పతనం: అఖిలేశ్

రాంలీలా మైదాన్ ప్రజాస్వామ్య యుద్ధానికి ఒక హల్దీ ఘాట్‌గా మారిందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ అన్నారు. 1576లో మొఘల్ సామ్రాజ్యానికీ, మేవార్ రాజ్యానికీ జరిగిన యుద్ధాన్ని ప్రస్తావించారు. ఉత్తరప్రదేశ్ ద్వారా అధికారంలోకి వచ్చిన వారందరూ.. తిరిగి ఉత్తరప్రదేశ్ ద్వారానే నిష్క్రమించక తప్పదన్నారు. ఇటీవలి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారణాసి ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్‌కు డబుల్ జీరో ఇచ్చి బుద్ధి చెప్పారన్నారు. 2022లో ఓట్ల చోరీతోనే యూపీలో బీజేపీ గెలిచిందన్నారు.

వారి జీవితం మాక్ పార్లమెంట్‌లోనే !

జీవితాంతం మాక్ పార్లమెంటులోనే!!

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అమిత్ షా ధ్వజం

విదేశీ శక్తుల ఆదేశాలతోనే ఇండి కూటమి ర్యాలీ

ఓట్ల చోరీపై ప్రత్యేక సమావేశాల్లో చర్చించండి

విపక్ష నేతలకు కేంద్ర హోం మంత్రి సవాల్

ఢిల్లీ, రోహతక్, సిమ్లాలో పోటాపోటీ ర్యాలీలు



న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఎప్పటికీ ప్రధాని కాలేరని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. ఆయన జీవితాంతం మాక్ పార్లమెంటులోనే ఉంటారని ఎద్దేవాచేశారు. 1984లో ఇదే రోజు సిక్కులపై దమనకాండ జరిగిందని.. దానిని విస్మరించి వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా ఢిల్లీలో ఇండి కూటమి ర్యాలీ చేపట్టడంపై మండిపడ్డారు. రాంలీలా మైదాన్‌లో విపక్షాల ర్యాలీకి పోటీగా ఢిల్లీ, రోహతక్, సిమ్లా సహా పలు చోట్ల బీజేపీ భారీ ర్యాలీలు నిర్వహించింది. ఆదివారం చండీగఢ్ పోలీసు శాఖ 60వ వ్యవస్థాపక దినోత్సవ సభలో అమిత్‌షా ప్రసంగించారు. విదేశీ శక్తుల ఆదేశాలతోనే రాహుల్ రామ్‌లీలా మైదాన్ ర్యాలీ చేపట్టారని ఆరోపించారు. గత మూడు దఫాలుగా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడుతూ వచ్చిందన్నారు. తన కుమారుడిని ప్రధానిగా చూడాలన్న సోనియాగాంధీ కల కలగానే మిగిలిపోయిందని చెప్పారు. 'దీంతో ఆమె 'మాక్ పార్లమెంటు' అనే కొత్త ఆలోచనతో వచ్చారు. రాహుల్‌కు ఓ విషయం చెప్పదలిచాను. మీరు ప్రధాని అవ్వాలనుకుంటే మాక్ పార్లమెంటులోనే జీవితాంతం ఉండండి. ఎందుకంటే మీరెప్పటికీ ప్రధాని కాలేరు. 1984లో సరిగ్గా ఇదే రోజున కాంగ్రెస్ ప్రోద్బలంతో వేల మంది సిక్కులను క్రూరంగా హత్య చేశారు. వేల మందిని సజీవ దహనం చేశారు. చాలా మంది సిక్కులు భయపడి పారిపోయారు. భారీ వృక్షం కూలినప్పుడు భూమి కంపిస్తుందని నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ చేసిన వ్యాఖ్యను ఎప్పటికీ మరువలేను. ఇప్పుడాయన కుమారుడు సిక్కుల గాయాలను రేపేలా ఇవాళ ర్యాలీ నిర్వహించారు. నాడు దమనకాండకు పాల్పడినవారిపై కేసులను మోదీ ప్రభుత్వం వచ్చాక తిరిగి తెరిచింది. బాధితులకు తలో రూ.5 లక్షల సాయం చేసింది. దమనకాండను ప్రేరేపించిన కాంగ్రెస్ నేతలను జైలుకు పంపేలా చేసింది' అని దుయ్యబట్టారు. అసత్య ప్రచారంతో, అరాచకాలు సృష్టిస్తూ.. పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకున్నాయని విమర్శించారు. దమ్ముంటే ఓట్ల చోరీపై ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో చర్చించాలని సవాల్ విసిరారు.

మోదీ ప్రభుత్వాన్ని పడగొట్టాలనే: నడ్డా

మోదీ ప్రభుత్వాన్ని కూల్చాలన్న దురుద్దేశంతోనే.. సిక్కుల అణచివేత జరిగిన రోజున కాంగ్రెస్ ఢిల్లీలో ర్యాలీ చేపట్టిందని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా ఆరోపించారు. ఇదో పిచ్చి నాటకమని.. కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్‌కు ఇక తెరపడినట్లేనని ఢిల్లీలో విలేకరుల సమావేశంలో స్పష్టంచేశారు. విపక్షాల నిరసన ర్యాలీ.. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన మోదీ ప్రభుత్వాన్ని తొలగించి.. భారత ప్రజాస్వామ్యాన్ని అరాచకం, గందరగోళంలోకి నెట్టేందుకు పకడ్బందీగా పన్నిన కుట్రేనని స్పష్టంచేశారు. పండుగల సీజన్‌లో లక్షలాది మంది దుకాణదారులు, వ్యాపారుల ఆదాయాన్ని దెబ్బతీయడం.. దేశాన్ని అప్రతిష్ఠ పాల్జేయడమే దీని లక్ష్యాలని చెప్పారు. నవంబరు 1 భారత ప్రజాస్వామ్య చరిత్రలోనే మాయనిమచ్చగా నిలిచిందన్నారు. సిక్కుల పట్ల చేసిన మహాపాపానికి గాంధీ కుటుంబం ఇప్పటికీ క్షమాపణ చెప్పలేదని.. వేల మంది సోదరీమణులు పసుపు కుంకుమలు పోగొట్టుకున్నారని.. ఢిల్లీలో ఉన్న 'విడో కాలనీ' కాంగ్రెస్ రక్తచరిత్రకు తార్కాణంగా నిలుస్తోందని తెలిపారు. ఇదివరకు జరిగిన నిరసనల కారణంగా చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులు రూ.3 వేల కోట్లు నష్టపోయారని.. తాజా ఆందోళనలతో ధనత్రయోదశి, దీపావళి, ఛఠ్‌పూజ పండుగల వేళ మరో పది వేల కోట్లు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పారు. అయినా రాహుల్‌గాంధీకి ఇవేమీ పట్టవని, వ్యాపార, వాణిజ్య సంఘాల వినతిపత్రాలను, లేఖలను ఆయన లక్ష్యపెట్టలేదని ఆక్షేపించారు. విదేశాలకు వెళ్లి భారత్‌ను అవమానిస్తారని.. తిరిగొచ్చాక దేశ ప్రజాస్వామ్యం, ఎకానమీపై దాడి చేస్తారని దుయ్యబట్టారు.

పశ్చిమ ఢిల్లీలో బీజేపీ భారీ ప్రదర్శన..

సిక్కులపై దమనకాండను వ్యతిరేకిస్తూ.. బీజేపీ ఆదివారం పశ్చిమ ఢిల్లీలోని హరినగర్ నుంచి తిలక్‌నగర్ వరకు భారీ పాదయాత్ర నిర్వహించింది. కేంద్ర పెట్రోలియం మంత్రి హర్‌దీప్‌సింగ్ పురీ దీనికి నాయకత్వం వహించారు. ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా, ఢిల్లీ మంత్రి మంజీందర్‌సింగ్ సిర్సా, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది హెచ్ఎస్ ఫూల్కా ఇందులో పాల్గొన్నారు. కాంగ్రెస్, రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హరియాణాలోని రోహతక్‌లో జరిపిన ర్యాలీకి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ హాజరయ్యారు. హిమాచల్‌ప్రదేశ్ రాజధాని సిమ్లాలో జరిగిన పాదయాత్రలో అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ పాల్గొన్నారు.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

ఉద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలి

పట్టభద్రుల ఎన్నికల్లో బీఆర్ఎ స్‌కు మద్దతు ఇవ్వండి

ఆకునూరు లక్ష్మయ్య పదవీ విరమణ సభలో దేవీప్రసాద్, కంచర్ల పిలుపు



ప్రజా దీవెన,నల్లగొండ: ఉద్యో గు ల సంక్షేమాన్ని విస్మరిస్తూ, వారి సమస్యల పరిష్కారం పట్ల నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న పట్టభద్రు ల ఎన్నికల్లో తగిన గుణపాఠం చె ప్పాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయ కులు, టీఎన్జీవో మాజీ అధ్యక్షు డు గుండవరపు దేవీప్రసాద్ రా వు, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కం చర్ల భూపాల్ రెడ్డి పిలుపునిచ్చా రు. ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేసిన కేసీఆర్ ప్రభుత్వ పా లనను గుర్తుచేసుకుని బీఆర్ఎ స్‌కు అండగా నిలవాలని కోరా రు.భూగర్భ జలవనరుల శాఖలో సూపరింటెండెంట్‌గా విధులు ని ర్వహించి పదవీ విరమణ పొంది న ఆకునూరు లక్ష్మయ్యకు నిర్వ హించిన ఆత్మీయ సన్మాన సభ లో దేవీప్రసాద్, కంచర్ల భూపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొ న్నారు.

ఉద్యోగులపై కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు

ఈ సందర్భంగా దేవీప్రసాద్ మా ట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రా ష్ట్ర సాధన ఉద్యమంలో టీఎన్జీ వోలు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు 43 శా తం ఫిట్‌మెంట్ ప్రకటించడంతో పాటు, ఉద్యోగులు ప్రశాంత వా తావరణంలో విధులు నిర్వహిం చుకునే పరిస్థితులు కల్పించార ని పేర్కొన్నారు.అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఉ ద్యోగులు అనేక ఇబ్బందులు ఎ దుర్కొంటున్నారని విమర్శించా రు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉ న్నారనే కారణంతో ఇప్పటివరకు 180 మంది ఉద్యోగులను సస్పెం డ్ చేయడం కక్షసాధింపు చర్యల కు నిదర్శనమని ఆరోపించారు. ఉద్యోగులకు రావాల్సిన ప్రయో జనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో ఉద్యోగులు, పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించాలని, బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా నిల వాలని కోరారు.అనంతరం పదవీ విరమణ పొందిన ఆకునూరు లక్ష్మయ్య సేవలను కొనియా డుతూ.. భూగర్భ జలవనరుల శాఖలో ఆయన అనేక బాధ్య త లను సమర్థవంతంగా నిర్వహిం చారని ప్రశంసించారు. పదవీ విర మణ అనంతరం కూడా ప్రజలకు మరిన్ని సేవలు అందిస్తూ ఆయు రారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

టీఎన్జీవో హాల్లో సభకు అడ్డంకు లు సృష్టించడం బాధాకరం

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆకునూరు ల క్ష్మయ్య తన ఉద్యోగ జీవితంలో అంకితభావంతో పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని అభి నందించారు. వాస్తవానికి ఈ ప దవీ విరమణ సన్మాన కార్యక్రమా న్ని టీఎన్జీవో హాల్లో నిర్వహించా ల్సి ఉండగా, రాజకీయ కారణా లతో కొందరు టీఎన్జీవో నాయకు లు అడ్డంకులు సృష్టించి లక్ష్మ య్యను అవమానపరిచారని ఆరోపించారు. ఇది అత్యంత బా ధాకరమైన విషయమని అన్నా రు.లక్ష్మయ్య భవిష్యత్తులో మ రింత ప్రజాసేవ చేయాలని, బీ ఆర్ఎస్ పార్టీలో చేరాలని ఆహ్వా నించారు. ఆయన పార్టీలోకి వస్తే సముచిత స్థానం కల్పించి గౌరవి స్తామని హామీ ఇచ్చారు. పానగ ల్ ప్రాంతానికి పూర్వవైభవం తీ సుకురావడంలో భాగస్వాములు కావాలని కోరారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు సంతోషంగా ఉన్నార ని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉ ద్యోగుల సమస్యలను పట్టించు కోవడం లేదని విమర్శించారు. ఉ ద్యోగులు గత పాలనలో పొందిన ప్రయోజనాలను, ప్రస్తుత పరిస్థి తులను బేరీజు వేసుకుని రాజకీ య నిర్ణయం తీసుకోవాలని విజ్ఞ ప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ నగ ర బీఆర్ఎస్ అధ్యక్షుడు భువన గిరి దేవేందర్, కంచనపల్లి రవీం దర్ రావు, కొండూరు సత్యనా రా యణ, కార్పొరేటర్లు కొండూరు దీ పిక, ప్రవీణ్ రెడ్డి, బాణావత్ దీ ప్లా, రావుల శ్రీనివాస్ రెడ్డి, జమా ల్ ఖాద్రి, పెరిక కరణ్, జయరాజ్, యాట జయప్రద రెడ్డి, జిల్లా టీఎ న్జీవో మాజీ అధ్యక్షుడు శ్రవణ్ కు మార్‌తో పాటు పలువురు టీఎ న్జీవో నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



ప్రజాదీవెన,కోదాడ: తెలంగాణ రాష్ట్ర యాదవ సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 4న రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఇందిరా పార్కు పక్కన జరిగే సదర్ ఉత్సవాలకు యాదవులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సీనియర్ యాదవ సంఘం నాయకులు ఈదుల కృష్ణయ్య యాదవ్ కోరారు. ఆదివారం కోదాడ పట్టణంలోని వారి నివాసంలో యాదవ సంఘం నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి ఉ త్తమ్ కుమార్ రెడ్డి తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న మన యాదవ కుల నాయకులందరూ విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఎంతో చారిత్రాత్మక ప్రాముఖ్యత కలిగినటువంటి ఈ ఉత్సవాలకు ఉ మ్మడి నల్లగొండ జిల్లాతో పాటు ముఖ్యంగా కోదాడ నియోజకవర్గంలో ఉన్న యాదవులందరూ అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కట్టే బోయిన శ్రీనివాస్ యాదవ్, సైదిబాబు, బడేటి వెంకటేశ్వరరావు, లిక్కి మోహన్ రావు యాదవ్, బారు వెంకన్న యాదవ్, గడ్డం మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాదారంలో వట్టికోట ఆళ్వార్ స్వామి జయంతి వేడుకలు



శాలిగౌరారం, నవంబర్ 1: శాలిగౌరారం మండలం మాదారం గ్రామంలోని వట్టికోట ఆళ్వార్ స్వామి జన్మస్థలంలో ఆళ్వార్ స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు జేరిపోతుల మల్లయ్య, యానాల సుదర్శన్ రెడ్డి, వార్డు మెంబర్ రాజుల శ్రీకాంత్,గ్రామ సిబ్బంది పాల్గొని ఆళ్వార్ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వట్టికోట ఆళ్వార్ స్వామి చేసిన సేవలు, తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర స్మరణీయమని కొనియాడారు.

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ మహా పోరాటం

ఢిల్లీలో 'ఓటు బచావో దేశ్ బచావో' మహా ర్యాలీ రామ్‌లీలా మైదానంలో నల్లగొం డ కాంగ్రెస్ నేతల గళం



ప్రజా దీవెన, నల్లగొండ: ఓటు హ క్కు పరిరక్షణే లక్ష్యంగా, ప్రజా స్వామ్య విలువలను కాపాడట మే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ చే పట్టిన 'ఓటు బచావో -- దేశ్ బ చావో' మహా ర్యాలీ దేశ రాజధా ని న్యూఢిల్లీలో ఉ త్సాహభరి తం గా సాగింది. చారిత్రాత్మక రామ్‌లీ లా మైదానంలో ఆదివారం నిర్వ హించిన ఈ భారీ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజాస్వామ్య పరిరక్షణ కు తమ మద్దతు ప్రకటించారు. ఈ ర్యాలీలో నల్లగొండ డీసీసీ అ ధ్యక్షుడు పున్న కైలాష్ నేతతో పా టు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎ మ్మెల్యే వేముల వీరేశం, మిర్యాల గూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారె డ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనా వత్ బాలు నాయక్, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి, డై రీ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రజాస్వామ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యం

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకు లు మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పిం చిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. ఆ హక్కును పరిరక్షించడం, ప్రజాస్వామ్య వ్య వస్థను బలోపేతం చేయడం, రా జ్యాంగ స్ఫూర్తిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశా రు. ప్రజాస్వామ్య పరిరక్షణ కో సం నిర్వహిస్తున్న ఈ మహా ర్యా లీ దేశవ్యాప్తంగా ప్రజల్లో చైత న్యం తీసుకువచ్చే కీలక కార్య క్రమమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు జిల్లపల్లి పరమే ష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి, జిల్లా ప్రధాన కార్య దర్శులు మేకల రాజేందర్ రెడ్డి, పోసిరెడ్డి సంతోష్ రెడ్డి, కుకుడాల బాలకృష్ణ, గోపిశెట్టి రాంబాబు, జిల్లా కార్యదర్శి పగిళ్ల రాజు, పళ్ల రవి తేజ, సూర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.'ఓటు బచావో -- దేశ్ బచావో' నినాదంతో సాగిన ఈ కార్యక్ర మం ద్వారా ఓటు హక్కు పరిర క్ష ణ, ప్రజాస్వామ్య విలువల ప్రా ధాన్యతపై కాంగ్రెస్ నాయకులు తమ గళాన్ని వినిపించారు.

నెల రోజులైనా ధాన్యం కొనుగోళ్లకు మోక్షం లేదా

కొనుగోలు కేంద్రాల్లో అన్నదాత ల పడిగాపులు అకాల వర్షాలతో తడుస్తున్న ధాన్యం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రై తులు కొనుగోలు కేంద్రాలకు చే రుకుని నెల రోజులు గడుస్తున్నా ధాన్యం కొనుగోళ్లలో మాత్రం కద లిక కనిపించడం లేదు. కాంటా లు వేయక.. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించ క.. అన్నదాతలను నానా ఇబ్బం దులకు గురిచేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వ ర్షిత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై తీ వ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభు త్వ, అధికారుల నిర్లక్ష్యం కారణం గా రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే రోజుల తరబడి పడిగాపులు కా యాల్సిన దుస్థితి నెలకొందని విమర్శించారు.

పంట పండించడమే కష్టమైతే.. అమ్ముకోవడం మరో పరీక్ష

ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్ర భావం, వర్షాభావ పరిస్థితులు, వి ద్యుత్ సరఫరాలో ఇబ్బందులతో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్ట పోయారని నాగం వర్షిత్ రెడ్డి పే ర్కొన్నారు. ఎన్నో వ్యయప్రయాస లకోర్చి పండించిన కొద్దిపాటి పం టను విక్రయించేందుకు కొనుగో లు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ కూడా రోజుల తరబడి నిరీక్షించా ల్సి వస్తోందన్నారు. పంట చేతికొ చ్చిందన్న సంతోషం కూడా రైతు లకు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డా రు.

అధికారుల పర్యవేక్షణ ఏది?

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముం దే జిల్లాలో వరి సాగు విస్తీర్ణం, అంచనా దిగుబడి, అవసరమైన కొనుగోలు కేంద్రాలు, గన్నీ సంచు లు, హమాలీలు, రవాణా వాహ నాలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చే యాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యత ను విస్మరించిందని విమర్శించా రు. కొనుగోలు కేంద్రాలకు ఎంత ధాన్యం వస్తుందో ముందుగానే అంచనా వేయలేని పరిస్థితి నెల కొందని, అధికారుల మధ్య సమ న్వయ లోపం రైతులకు శాపంగా మారిందని ఆరోపించారు.

రైతులకు కంటిమీద కునుకు లేదు!

ఇప్పటికే అకాల వర్షాలు, ముసు రు రైతులను మరింత ఆందోళన కు గురిచేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం వర్షా లకు తడిసి ముద్దవుతుండటం తో నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఏర్పడిందన్నారు. పంట ను కాపా డుకునేందుకు రైతులు నానా అవస్థలు పడు తున్నా అధికారు లు కనీస రక్షణ ఏర్పాట్లు చేయక పోవ డం దురదృష్టకరమని పేర్కొ న్నారు.కేంద్ర ప్రభుత్వం కనీస మ ద్దతు ధరతో పాటు ధాన్యం సే కరణకు అ వసరమైన సహకారం అందిస్తు న్నప్పటికీ, రాష్ట్ర ప్రభు త్వం కొను గోలు కేంద్రాల నిర్వహ ణ, కాంటాలు, ధా న్యం తరలింపు లో విఫల మవుతోందని ఆరోపిం చారు.

మంత్రి ప్రత్యేక చొరవ చూపాలి

నల్లగొండ జిల్లాకు మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి శాపంగా మారార ని నాగం వర్షిత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్య లు చేశారు. కొనుగోలు కేంద్రాల ను ప్రారంభించి చేతులు దులు పుకోవడం కాకుండా రైతుల ధా న్యానికి సకాలంలో కాంటాలు వేయించి, కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయించి, మిల్లులకు తర లించే బాధ్యతను ప్రభుత్వం తీ సుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి రైతుల సమస్యలపై ప్రత్యే క దృష్టి సారించాలని కోరారు.

కలెక్టర్ తక్షణమే స్పందించాలి.. బీజేపీ



డిమాండ్లు ఇవే!

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల సమ స్యపై జిల్లా కలెక్టర్ వెంటనే జో క్యం చేసుకుని యుద్ధ ప్రాతిపదిక న చర్యలు చేపట్టాలని నాగం వర్షిత్ రెడ్డి డిమాండ్ చేశారు. నెల రోజులుగా కొనుగోలు కేంద్రా ల్లో ఎదురుచూస్తున్న రైతుల ధా న్యానికి తక్షణమే కాంటాలు వే యాలని, కొనుగోలు చేసిన ధా న్యాన్ని ఏమాత్రం జాప్యం లేకుం డా మిల్లులకు తరలించాలని, అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు టార్పాలిన్లు, ఇత ర రక్షణ ఏర్పాట్లు చేయాలని, గన్నీ సంచులు, హమాలీలు, ర వాణా వాహనాలను తగిన సం ఖ్యలో అందుబాటులో ఉ ంచాల ని, వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులకు నష్టం కలగ కుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో అధికా రుల పర్యవేక్షణ పెంచి రైతుల స మస్యలను వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు.

రాజకీయాల కంటే రైతుల ప్రయో జనాలే ముఖ్యం!

రైతులను ఆదుకోవాల్సిన సమ యంలో ప్రజాప్రతినిధులు రాజ కీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని నాగం వర్షిత్ రెడ్డి వి మర్శించారు. రైతుల సమస్యల పరిష్కారంపై మంత్రులు, ఎమ్మె ల్యేలు, అధికార పార్టీ నాయకు లు తగిన శ్రద్ధ చూపడం లేదని ఆ రోపించారు. రైతుల కష్టాన్ని రాజ కీయ ప్రచారానికే పరిమితం చే యకుండా వారి పంటకు గిట్టు బాటు ధర, సకాలంలో కొనుగో లు కల్పించాలని హితవు పలి కారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభు త్వం, జిల్లా యంత్రాంగం స్పందిం చి ధాన్యం కొనుగోళ్లు, కాంటాలు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను ఇలాగే నిర్ల క్ష్యం చేస్తే భారతీయ జనతా పార్టీ రైతుల పక్షాన నిలబడి పెద్ద ఎత్తు న ప్రజా ఉద్యమాలకు సిద్ధమవు తుందని హెచ్చరించారు.ఈ కా ర్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వా మి, నాయకులు వంగూరి రాఖీ, పాలకూరి రవిగౌడ్, మంగలిపల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

జనగాం 'రేషన్' జగడాలు!

బియ్యం పంపిణీలో అధికారుల ఇష్టారాజ్యం ?
సవాలక్ష సమస్యలతో సమస్తం సతమతం
కమిషనర్ ఆదేశాలు బేఖాతర్‌తో సమస్యలు ఉత్పన్నం
కలెక్టర్ పేరుతో బలవంతంగా మూడునెలల బియ్యం దిగుమతి
20 రోజుల క్రితమే తరలింపులపై 'విత్‌హోల్డ్' ఉత్తర్వులు
ఆ గోదాముల్లో స్టాక్ ఆడిట్, విజిలెన్స్ విచారణకు డీలర్ల సంఘం డిమాండ్

ప్రజా దీవెన, హైదరాబాద్: జనగాం జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవ స్థ (PDS) బియ్యం సరఫరా వ్య వహారం అధికార యంత్రాంగంలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. పౌర సరఫరాల శాఖ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలకు విరుద్ధంగా జి ల్లా స్థాయిలో మూడు నెలల రేష న్ బియ్యాన్ని రేషన్ దుకాణాల కు తరలించారన్న ఆరోపణలు క లకలం రేపుతున్నాయి. నవంబర్ 2026 నుంచి జనవరి 2027 వర కు లబ్ధిదారులకు పంపిణీ చేయా ల్సిన బియ్యాన్ని ముందస్తు కేటా యింపులు, ఆన్‌లైన్ అనుమతు లు లేకుండానే గోదాముల నుంచి నేరుగా దుకాణాలకు దింపించార న్న ఫిర్యాదులు వెలుగులోకి వ చ్చాయి. ఈ వ్యవహారంపై కమిష నర్ కార్యాలయం ఇప్పటికే తర లింపు ఆదేశాలను నిలిపివే యా లని సూచించినట్లు ఫిర్యాదు దా రులు పేర్కొంటుండటంతో వివా దం మరింత ముదిరింది.

కమిషనర్ అనుమతి లేకుండానే బియ్యం తరలింపు?

డీలర్ల సంఘం ప్రతినిధులు, ర వాణా కాంట్రాక్టర్లు చేస్తున్న ఆరో పణల ప్రకారం జిల్లా కలెక్టర్, జా యింట్ కలెక్టర్ పేరుతో జారీ చే సిన ఆదేశాల ఆధారంగా ఎఫ్‌ఐజ/ఎఐజ గోదాముల నుంచి నేరుగా రేషన్ దుకాణాలకు మూడు నె లల బియ్యం స్టాక్‌ను దింపించి నట్లు తెలుస్తోంది. అయితే, ఈ తరలింపునకు పౌరసరఫరాల శా ఖ కమిషనర్ కార్యాలయం నుం చి అవసరమైన అలాట్మెంట్, ణ ఖ= జనరేషన్ జరగలేదని వారు ఆరోపిస్తున్నారు.రేషన్ డీలర్లపై ఒత్తిడి తెచ్చి, బియ్యం దింపుకో కపోతే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించినట్లు బాధితులు ఫిర్యాదు చేసినట్లు స మాచారం. అధికారుల ఆదేశాల పేరుతో బలవంతంగా స్టాక్ దిం పించారని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలపై అ ధికారికంగా సమగ్ర విచారణ జర గాల్సిన అవసరం ఉందన్న డి మాండ్ వినిపిస్తోంది.

అసలు రేషన్ బియ్యం సరఫరా విధానం ఏమిటి?

పౌరసరఫరాల శాఖలో అమలు లో ఉన్న సాధారణ ప్రక్రియ ప్రకారం.. ముందుగా కమిషనర్ కా ర్యాలయం నుంచి జిల్లాల వారీగా బియ్యం కేటాయింపులు జ రగాలి. జిల్లాలో సీఎంఆర్, ఎస్వీ ఆర్, హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకం తదితర అవసరాలకు అ నుగుణంగా స్టాక్ కేటాయిస్తారు. అనంతరం జిల్లా మేనేజర్ అలా ట్మెంట్ ఆర్డర్ ప్రకారం ఏ మీూ పా యింట్‌కు ఎంత బియ్యం పంపిం చాలనేది నిర్ణయిస్తారు.ఆ కేటా యింపుల ఆధారంగా ఎఫ్‌ఐజ గో దాము నుంచి స్టేజ్-1 రవాణా కాంట్రాక్టర్ ద్వారా సంబంధిత IM G గోదాములకు బియ్యం తరలి స్తారు. అక్కడ స్టాక్‌ను దిగుమతి చేసుకుని నిల్వ చేస్తారు. అనంతరం కమిషనర్ కార్యాలయం నుం చి స్టేజ్-2 అలాట్మెంట్ జారీ అవు తుంది. ఏ రేషన్ డీలర్‌కు ఎంత బియ్యం పంపించాలన్న వివరాలు ఆ కేటాయింపులో ఉంటాయి. కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన వివరాల ఆధారంగా DK R జనరేట్ అవుతుంది. జిల్లా పౌ రసరఫరాల అధికారి (DSO) త న లాగిన్‌లో ఆమోదించిన త ర్వాత సంబంధిత మీూ పాయిం ట్లు కనిపిస్తాయి. వాటి ఆధారం గా స్టేజ్-2 కాంట్రాక్టర్లు రేషన్ దు కాణాలకు బియ్యాన్ని తరలించా ల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను ప క్కనపెట్టి నేరుగా గోదాముల నుంచి రేషన్ షాపులకు బియ్యం దింపించారన్నదే ప్రస్తుతం వివాదానికి ప్రధాన కారణంగా మారిం ది.

కమిషనర్ 'విత్‌హోల్డ్' ఆదేశా లతో మరింత ముదిరిన వివాదం

ఈ వ్యవహారానికి సంబంధించి అదనపు కలెక్టర్ కార్యాలయం నుంచి 06-10-2026న జారీ చే సినట్లు పేర్కొంటున్న లేఖ నంబర్ DMCSJN/Paddy/002 0/2026ను, పౌరసరఫరాల క మిషనర్ కార్యాలయం 13-10 -2026న జారీ చేసినట్లు పేర్కొంటున్న Ref.No.PDS.II(1)/26 40/2023 ఉ త్తర్వులను ఫిర్యాదుదారులు ప్రస్తావిస్తున్నారు. కమిషనర్ కార్యాలయం నుంచి జారీ అయిన విత్‌హోల్డ్ ఆదేశా ల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉ న్న బియ్యం తరలింపు ప్రక్రియ ను నిలిపివేయాలని సూచించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అ యితే ఆ ఉత్తర్వులు వెలువడి సుమారు 20 రోజులు గడిచినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీ సుకోలేదని డీలర్ల సంఘం ప్రతి నిధులు ప్రశ్నిస్తున్నారు.

రవాణా కాంట్రాక్టర్ల బిల్లుల పెండింగ్‌పై ఆందోళన

ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు తొమ్మిది నెలలుగా రవాణా కాం ట్రా క్టర్లకు బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచినట్లు ఫిర్యాదు దారులు ఆరోపిస్తున్నారు. ఇప్ప టికే రవాణా ఖర్చులు, నిర్వహణ భారంతో ఇబ్బందులు పడుతు న్న కాంట్రాక్టర్లకు బిల్లుల విడుద ల కాకపోవడం మరింత సమస్య గా మారిందని చెబుతున్నారు. ఈ అంశంపై కూడా ఉ న్నతాధి కా రులు స్పందించి పెండింగ్ బిల్లు లను పరిశీలించి చెల్లింపులు జ రపాలని కోరుతున్నారు.

విజిలెన్స్ విచారణకు నాలుగు ప్రధాన డిమాండ్లు

- ఈ వ్యవహారంపై ఫిర్యాదుదారులు ఉన్నతాధికారుల ముందు పలు ప్రశ్నలు ఉంచారు.
- కమిషనర్ విత్‌హోల్డ్ ఆదేశాల ను ఉ ల్లంఘించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా అధికారు ల పా త్రపై విచారణ జరిపి, తప్పి దాలు రుజువైతే క్రమశిక్షణా చ ర్యలు తీసుకోవాలి.
- బలవంతంగా బియ్యం దింపిం చారన్న ఆరోపణలపై సంబంధిత =ణూ, వీ=ాల పాత్రను పరిశీలిం చాలి.
- ఐదు గోదాముల్లో నిల్వలు, కే టాయింపులు, రవాణా రికా ర్డు లను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ విభాగంతో తనిఖీ చేయిం చి సమగ్ర స్టాక్ ఆడిట్ నిర్వహిం చాలి.
- ఫిబ్రవరి నుంచి అక్టోబర్ వరకు పెండింగ్‌లో ఉ న్న రవాణా కాంట్రా క్టర్ల బిల్లులను పరిశీలించి వెంట నే చెల్లింపులు జరిపించాలి.
- ప్రభుత్వం స్పందించాలి.. బా ధ్యులపై చర్యలు తీసుకోవాలి.
- ప్రజలకు అందాల్సిన రేషన్ బి య్యం సరఫరా వ్యవస్థలో నిబం ధనల ఉల్లంఘన జరిగిందన్న ఆ రోపణలు రావడం ఆందోళన కలి గిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథ కాల అమలులో పారదర్శకత, అ ధికారుల మధ్య సమన్వయం అ త్యంత కీలకం. ఒకవైపు కమిషన ర్ కార్యాలయం ఆదేశాలు, మరో వైపు జిల్లా స్థాయి నిర్ణయాల మ ధ్య తలెత్తిన ఈ వివాదం చివర కు రేషన్ డీలర్లు, రవాణా కాంట్రా క్టర్లను ఇబ్బందులకు గురిచేస్తోం దన్న విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి.

అసలు ఎన్ని టన్నుల బియ్యం తరలించారు? ఏ అధికారుల ఆ దేశాల మేరకు తరలించారు? కమిషనర్ కార్యాలయం నుంచి అనుమతులు ఉ న్నాయా? గోదా ముల్లో స్టాక్ వివరాలు సరిపో తు న్నాయా? విత్‌హోల్డ్ ఉత్తర్వుల తర్వాత కూడా సరుకు తరలిం పు జరిగిందా? అనే అంశాలపై ప్ర భుత్వం తక్షణమే విచారణ జరి పించాల్సిన అవసరం ఉంది.

కమిషనర్ ఆదేశాలు అమలవు తాయా? జిల్లా అధికారులపై వి చారణ మొదలవుతుందా? లేక ఈ వ్యవహారం ఫైళ్లకే పరిమితమ వుతుందా? అన్నది ఇప్పుడు జ నగాం జిల్లాలో ఆసక్తికర చర్చగా మారిందంటే అతిశయోక్తి కాదు.

అధికారుల మధ్య సమన్వయ లోపమే కారణమా?

జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ణూా, ణవీ సివిల్ సప్లైస్, RDO, MROల మధ్య సరైన సమన్వ యం లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమైందా? లేక నిబంధన లను తెలిసి కూడా ఉల్లంఘిం చా రా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నా యి. జిల్లా స్థాయి ఆదేశాల మే రకు పనిచేయాలా? లేక కమిష నర్ కార్యాలయం నుంచి వచ్చే అలాట్మెంట్ ప్రకారమే సరఫరా చే యాలా? అనే సందిగ్ధతలో డీలర్లు, రవాణా కాంట్రాక్టర్లు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నట్లు ఫిర్యా దులు వస్తున్నాయి.మరోవైపు, గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యం పరిమాణం, రికార్డుల్లో నమోదైన స్టాక్, వాస్తవంగా తరలించిన స రుకు మధ్య తేడాలు ఉన్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తు న్నాయి. అయితే ఈ ఆరోపణలు ఇంకా అధికారికంగా నిర్ధారణ కా లేదు. అందువల్ల గోదాముల వా రీగా స్టాక్ తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాల న్న డిమాండ్ బలపడుతోంది.

దెబ్బతిన్న 48 గంటల్లో విద్యుత్ పునరుద్ధరణ

అర్నబ్ తుఫాన్ సవాళ్లను దృష్టిలో పెట్టుకుని..
మరింత సమర్థంగా సహాయక చర్యలు చేపట్టాలి
విద్యుత్ శాఖ సన్నద్ధతపై సీఎం చంద్రబాబు సమీక్ష
సాయం చేయాలని తమిళనాడు, కర్ణాటక సీఎంలకు ఫోన్


అమరావతి : మురసు తుఫాను ప్రభావం విద్యుత్తు శాఖపై ఏ స్థాయిలో ఉండనుంది.. దాన్ని ఎదుర్కొనేందుకు ఎలా సన్నద్ధం కావాలి అనే అంశాలపై సీఎం చంద్రబాబు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దీనిపై విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఆ శాఖ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ విజయానంద్, ఉన్నతాధికారులతో ఆదివారం ఆయన సమీక్ష నిర్వహించా రు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రభావిత జిల్లాలకు సిబ్బంది, సామగ్రిని ముందే తరలించాలని సూచించారు. అవసరమైతే తెలంగాణ, తమిళనాడు నుంచి అదనపు సిబ్బంది, యంత్రాలు, పరికరాలు తెప్పించాలని సూచించారు. ఇప్పటికే తెలంగాణ నుంచి 500 మంది సిబ్బంది వచ్చారని, అవసరమైన సిబ్బందిని, యంత్రాలు పంపేందుకు తమిళనాడు కూడా అంగీకరించిందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సీఎంకి తెలిపారు. కాగా, విద్యుత్ వ్యవస్థ దెబ్బతిన్న 48 గంటల్లోనే సరఫరాను పునరుద్ధరించాలని సీఎం ఆదేశించారు. సోమవారం నుంచి ప్రతి 4-6 గంటలకు తుఫాను ప్రభావంపై బులిటెన్ విడుదల చేయాలన్నారు. కాగా, విద్యుత్ మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులను ఆదేశించారు.

తమిళనాడు, కర్ణాటక సీఎంలకు చంద్రబాబు ఫోన్

తుఫాన్ నేపథ్యంలో తమిళనాడు సీఎం విజయ్‌కు చంద్రబాబు ఫోన్ చేశారు. విద్యుత్ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాదం ఉందని, వాటి పునరుద్ధరణకు తమిళనాడు ప్రభుత్వం సాయం అందించాలని కోరారు. దీనిపై విజయ్ సానుకూలంగా స్పందించారు. తప్పకుండా సిబ్బందిని, యంత్రాలను పంపుతామని హామీ ఇచ్చారు. అలాగే కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు.

చౌటుప్పల్‌లో జోగిని దారుణ హత్య


భారీ దోపిడీ, కారుతో సహా పరారైన దుండగు లు
60 తులాల బంగారం, రూ.10 లక్షల నగదు అపహరణ



ప్రజా దీవెన, చౌటుప్పల్: యాదా ద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో అర్ధరాత్రి చోటుచేసుకున్న దారు ణ హత్య తీవ్ర కలకలం రేపింది. జోగినిగా పేరొందిన రాళ్లబండి సుధాకర్‌ను గుర్తుతెలియని దుం డగులు అత్యంత దారుణంగా హత్య చేసి, భారీ దోపిడీకి పాల్ప డ్డారు.హత్య అనంతరం ఇంట్లో ఉన్న సుమారు 60 తులాల బం గారు ఆభరణాలు, రూ.10 లక్షల నగదును దుండగులు అపహరించారు. అంతటితో ఆగకుండా సు ధాకర్‌కు చెందిన కారును సైతం ఎత్తుకెళ్లి అక్కడి నుంచి పరారయ్యారు. ఒకే ఘటనలో హత్యతో పాటు భారీ దోపిడీ జరగడంతో స్థాని కంగా తీవ్ర భయాందోళనలు నెల కొన్నాయి. సమాచారం అందు కున్న పోలీసులు వెంటనే ఘట నా స్థలానికి చేరుకుని పరిశీలిం చారు. క్లూస్ టీమ్‌ను రంగంలోకి దించి కీలక ఆధారాలను సేకరిం చారు.ఈ ఘటనపై కేసు నమో దు చేసిన పోలీసులు హత్యకు గ ల కారణాలు, దుండగుల ఆచూ కీ, దోపిడీ వెనుక ఉన్న వ్యక్తుల వి వరాలపై దర్యాప్తు ముమ్మరం చే శారు. అర్ధరాత్రి జరిగిన ఈ ఘోర ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీ యాంశంగా మారింది.

రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా షేక్ ఫయాజ్ ఏకగ్రీవ ఎన్నిక

కోదాడకు దక్కిన రాష్ట్రస్థాయి కీలక పదవి....



ప్రజా దీవెన, కోదాడ : తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోదాడకు చెందిన షేక్ ఫయాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతను కోదాడకు చెందిన ఫయాజ్‌కు అప్పగించడంపై స్థానిక రేషన్ డీలర్లు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘంలో గతంలో పలు పదవులు నిర్వహించిన ఫయాజ్, డీలర్ల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న ఇబ్బందులు, డీలర్ల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యలపై సంఘం తరఫున పలుమార్లు తన గళాన్ని వినిపించారు. డీలర్ల సమస్యలను రాష్ట్రస్థాయి నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేశారు. సంఘంలో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ డీలర్లకు అండగా నిలిచారు. ఈ క్రమంలో ఆయన సేవలను గుర్తించిన సంఘం రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల రేషన్ డీలర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటే రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఖాజా మోహినుద్దీన్‌లకు షేక్ ఫయాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ రాష్ట్రంలోని రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఫయాజ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నిక కావడం పట్ల పలువురు రేషన్ డీలర్ల సంఘం నాయకులు, స్థానిక ప్రముఖులు అభినందనలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో డీలర్ల సంక్షేమానికి మరింత కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పులివెందులలో హైటెన్షన్!

లీపోలింగ్ పెడితేనే ఓటేస్తా!
కార్యాలయం ఎదుట జగన్ నిరసన
70 మంది వైఎస్సార్ సీపీ ఏజెంట్లతో బైఠాయింపు
ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదు..
లీపోలింగ్‌కు డిమాండ్
చివరకు ఓటు వేయకుండానే వెనుతిరిగిన వైసీపీ అధినేత జగన్
వైసీపీ ఏజెంట్లను ఎవరూ అడ్డుకోలేదు: కలెక్టర్ శ్రీధర్ ప్రకటన



కడప : పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పులివెందులలో హైటె వెన్ వాతావరణం చోటుచేసుకుంది. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు జరుగుతున్న ఎన్నికల పోలింగ్ సందర్భంగా తన ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆదివారం పులివెందులకు చేరుకున్న వైఎస్సార్సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆందోళనకు దిగారు. ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని, తమ పార్టీ ఏజంట్లను పోలింగ్ బూత్లలోకి అనుమతించకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ పులివెందుల ఆర్వో కార్యాలయం ముందు నిరసన తెలిపారు. 70 మంది వైఎస్సార్సీపీ ఏజెంట్లతో కలిసి బైఠాయించారు. ఆర్వో శ్రీనివాస్, ఆర్డీవో చిన్నయ్యతో మాట్లాడిన జగన్.. వైసీపీ ఏజెంట్లను అడ్డుకోవడంపై ప్రశ్నించారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు లేవు.. అంటూ అధికారులను వైఎస్ జగన్ నిలదీశారు. అధికారులు మౌనంగా ఉంటే ప్రజాస్వా మ్యానికే ప్రమాదం. ఇలా జరిగితే వీటిని ఎన్నికలంటారా?! ఎన్నికల్లో అక్రమాలపై ఆధారాలన్నీ ఉన్నాయి. బీహార్ పరిస్థితులను ఏపీలో చూస్తున్నాం. మాజీ సీఎం నియో జకవర్గంలో ఈ పరిస్థితులేంటి?.. అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

లాఠీఛార్జ్ చేస్తారా చేయనీయండి..

పులివెందులలో వాళ్లకు నచ్చినట్టు ఓట్లు వేసుకుంటు న్నారు అంటూ జగన్ ఆరోపించారు. మాజీ సీఎంను కొట్టామని అనిపించుకోవాలంటే చేయండి. లాఠీఛార్జ్ చేస్తారా చేయనీయండి.. ఆదొక్కటే మిగిలింది. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు ఎందుకు జరపడం లేదు. ఎన్నికలు జరపడానికి చంద్రబాబుకు ఎందుకంత భయం ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకుండా ఏకగ్రీవాలు చేసుకుంటారా? బూత్లను క్యాప్చర్ చేసి రిగ్గింగ్ చేసుకుంటున్నారు. ఓడిపోతామనే భయం ఉన్న ప్పుడ ఎన్నికలు ఎందుకు? అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

న్యాయంగా లీపోలింగ్ పెడితేనే ఓటు వేస్తా..

పులివెందుల ఎన్నికల ప్రక్రియలో అన్యాయం రాజ్యమేలిందని అందువల్ల స్థానిక ఎన్నికల్లో తాను ఓటు వేయడం లేదని వైఎస్ జగన్ ప్రకటించారు. ధర్మబద్ధంగా, న్యాయమైన పద్ధతిలో పులివెందులలో రీపోలింగ్ నిర్వహిస్తేనే ఓటు హక్కును వినియోగించుకుంటానని స్పష్టం చేశారు. పులివెందులలో పరిస్థితులు అత్యంత దారుణంగా మారాయని, ఈ వాస్తవం రాష్ట్ర ప్రజలందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఓటు వేయకుండానే జగన్ వెనుతిరిగారు..అంతకు ముందు మీడియాతో మాట్లాడిన వైఎస్ జగన్.. రాష్ట్రంలో పరిస్థితి దయనీయంగా మారాయని ఆరోపించారు.

హెలికాప్టర్ ల్యాండింగ్ పై హైడ్రామా..

మాజీ సీఎం వైఎస్ జగన్ హెలికాప్టర్ ల్యాండింగ్ విషయంలోనూ కొంత హైడ్రామా చోటు చేసుకుంది. జగన్ పులివెందుల పర్యటనకు సంబంధించి హెలికాప్టర్ ప్రయాణానికి సంబంధిత అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో ఆదివారం ఉదయం ప్రత్యేక హెలికాప్టర్ లో బెంగుళూరు నుంచి బయలుదేరారు. 9.50 గంటలకు పులివెందులలో హెలికాప్టర్ ల్యాండ్ కావలసి ఉంది. అధికారులు అనూహ్యంగా ల్యాండింగ్ అనుమతివ్వలేదు. కానీ, హెలికాప్టర్లో ఇంధనం లేదనే కారణంగా పైలెట్లు హెలికాప్టర్ను పులివెందులలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఇక.. జగన్ బెంగళూరు నుంచి పులివెందుల చేరుకుని కాన్వాయి వెళ్తున్న సమయంలో వివేకా హత్య కేసు నిందితుడు దస్తగిరి హాల్ చల్ చేశాడు. జగన్ కాన్వాయ్ ను దస్తగిరి అడ్డుకున్నాడు. ఈ నేపథ్యంలో కాసేపు గందరగోళం నెలకొంది. జడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న వైఎస్ జగన్ కాన్వాయ్ లోకి దస్తగిరి కారు ఎలా వచ్చిందని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.

ఐదో టీ20లో భారత్‌పై కివీస్ ఘన విజయం

భారత్ బౌలర్లపై విరుచుకుపడ్డ కివీస్.. 3-2తో సిరీస్ ముగింపు

ఏడు వికెట్ల తేడాతో న్యూజిలాండ్ గెలుపు

భారత్ స్కోరు 191/8

ఇషాన్ కిషన్ 61 పరుగులు, శ్రేయస్ అయ్యర్ అర్ధశతకం

రెండు ఓవర్లు మిగిలుండగానే విజయాన్ని అందుకున్న కివీస్

సీఫర్ట్ 93, ఫిలిప్స్ 65 నాటౌట్



ఐదో టీ20లోనూ భారత జట్టుకు నిరాశే ఎదురైంది. సొంతగడ్డపై న్యూజిలాండ్ అద్భుతంగా ఆడి భారత్‌పై 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. లక్ష్యాన్ని న్యూజిలాండ్ 18 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి మూడు మ్యాచ్ ల్లో వరుస విజయాలతో భారత్ ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే, చివరి రెండు మ్యాచ్ ల్లోనూ న్యూజిలాండ్ నెగ్గడంతో, ఈ ఐదు మ్యాచ్ ల సిరీస్ లో భారత్ ఆధిక్యం 3-2కి తగ్గింది.

నేటి మ్యాచ్ విషయానికొస్తే.. భారత్ ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్ (61; 32 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లు), శ్రేయస్ అయ్యర్ (50; 23 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. నమన్ ధీర్ 33, నితీశ్ కుమార్ రెడ్డి 22 పరుగులు చేశారు. అయితే మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. న్యూజిలాండ్ బౌలర్లలో ఆడమ్ మిల్నే 19 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. నాథన్ స్మిత్, బ్లెయిర్ టిక్నర్ రెండేసి వికెట్లు తీశారు. 192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కివీస్‌కు టిమ్ సీఫర్ట్ (93; 50 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లు), గ్లెన్ ఫిలిప్స్ (65 నాటౌట్; 38 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్సర్లు) అద్భుత విజయాన్ని అందించారు. డారిల్ మిచెల్ 29 పరుగులతో రాణించాడు. సీఫర్ట్-మిచెల్ జోడీ రెండో వికెట్‌కు 73 పరుగులు జోడించగా, సీఫర్ట్-ఫిలిప్స్ జంట మూడో వికెట్‌కు 86 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, నితీశ్ కుమార్ రెడ్డి ఒక్కో వికెట్ తీశారు. సీఫర్ట్-ఫిలిప్స్ ధాటికి భారత బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. మరో రెండు ఓవర్లు మిగిలుండగానే కివీస్ లక్ష్యాన్ని అందుకుంది.

ఆ విషయాల్లో మేం ఇంకా మెరుగ్గా ఉండాల్సింది.. న్యూజిలాండ్‌తో ఓటమిపై శ్రేయస్

బ్యాటింగ్‌లో కోల్పోయిన ఊపు, బౌలింగ్, ఫీల్డింగ్‌లో పేలవ ప్రదర్శనే న్యూజిలాండ్‌తో ఐదో టీ20లో ఓటమికి కారణమని భారత టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అభిప్రాయపడ్డాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇషాన్ కిషన్‌తో కలిసి మంచి భాగస్వామ్యం నెలకొల్పినా.. వరుస ఓవర్లలో వికెట్లు కోల్పోవడంతో ఆశించిన స్కోరు సాధించలేకపోయామని చెప్పాడు. బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చాల్సిందని అంగీకరించాడు. ఆదివారం సెడ్డన్ పార్క్‌లో జరిగిన ఐదో టీ20లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 191/8 పరుగులు చేసింది. ఇషాన్ కిషన్ (61), శ్రేయస్ అయ్యర్ (50) అర్ధశతకాలతో రాణించారు. అయితే వీరిద్దరూ 11, 12వ ఓవర్లలో వరుసగా ఔటవడంతో భారత్ ఇన్నింగ్స్ జోరు తగ్గింది. కొత్తగా క్రీజులోకి వచ్చిన బ్యాటర్లపై ఒత్తిడి పెరిగిందని శ్రేయస్ తెలిపాడు. పిచ్‌పై బంతి స్వింగ్ అవడంతో పాటు కొన్ని సందర్భాల్లో వేగంగా దూసుకొచ్చిందని చెప్పాడు. హార్డ్ లెంగ్త్ బంతులను ఎదుర్కోవడం సవాలుగా మారిందన్నాడు. తాను, తిలక్ వర్మ కూడా ఇలాంటి బంతులకే ఔటయ్యామని గుర్తుచేశాడు. ఈ పరిస్థితుల్లో 194 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించడం ఫర్వాలేదనిపించిందని పేర్కొన్నాడు. అయితే బౌలింగ్, ఫీల్డింగ్‌లో జట్టు ఇంకా మెరుగ్గా ఆడాల్సిందని శ్రేయస్ అన్నాడు. ఛేజింగ్‌లో టిమ్ సీఫర్ట్ 13 పరుగుల వద్ద ఉన్నప్పుడే నమన్ ధీర్ క్యాచ్ వదిలేశాడు. తర్వాత గ్లెన్ ఫిలిప్స్ ఇచ్చిన కఠినమైన క్యాచ్‌ను సంజు శాంసన్ అందుకోలేకపోయాడు. ఈ తప్పిదాలపై జట్టు సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. ముఖ్యంగా ఫీల్డింగ్‌పై దృష్టి పెట్టాలని సూచించాడు. న్యూజిలాండ్ పర్యటన మంచి అనుభవాన్నిచ్చిందని శ్రేయస్ చెప్పాడు. తొలి మూడు మ్యాచ్‌ల్లోనే భారత్ సిరీస్‌ను కైవసం చేసుకోవడంతో చివరి రెండు మ్యాచ్‌ల్లో ప్రయోగాలు చేసేందుకు అవకాశం లభించిందన్నాడు. ఐదో మ్యాచ్‌లో తమను తాము పరీక్షించుకునే మంచి అవకాశం వచ్చినా.. దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయామని అంగీకరించాడు. భారత్ నిర్దేశించిన 192 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ 18 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. టిమ్ సీఫర్ట్ 93 చేయగా, గ్లెన్ ఫిలిప్స్ అజేయంగా 65 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. చివరి మ్యాచ్‌లో ఓటమితో భారత్ నిరాశపరిచినా.. ఐదు టీ20ల సిరీస్‌ను 3-2తో సొంతం చేసుకుంది.

డబ్ల్యూటీసీ పట్టికలో పెను మార్పులు

అగ్రస్థానానికి న్యూజిలాండ్, నాలుగో స్థానానికి టీమిండియా



కేప్‌టౌన్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్ నిర్ణయాత్మక మూడో టెస్టులో సౌతాఫ్రికా 176 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ ఫలితం ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025-27 పాయింట్ల పట్టికలో పెను మార్పులకు కారణమైంది. ఈ విజయంతో సౌతాఫ్రికా రెండో స్థానానికి ఎగబాకగా, అప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న ఆస్ట్రేలియా మూడో స్థానానికి పడిపోయింది. దీంతో న్యూజిలాండ్ పట్టికలో అగ్రస్థానానికి చేరింది. ఈ మ్యాచ్‌లో 288 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా బౌలర్ల ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 111 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ సైమన్ హార్మర్ ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా, పేసర్ కగిసో రబాడ మూడు వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో సౌతాఫ్రికా 2-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకోవడమే కాకుండా, టెస్ట్ ర్యాంకింగ్స్‌లోనూ ఆస్ట్రేలియాను వెనక్కి నెట్టి నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. తాజా మార్పుల ప్రకారం, డబ్ల్యూటీసీ పట్టికలో న్యూజిలాండ్ 72.22 పర్సంటేజ్ ఆఫ్ పాయింట్స్ (పీసీటీ)తో అగ్రస్థానంలో నిలిచింది. 71.43 పీసీటీతో సౌతాఫ్రికా రెండో స్థానానికి చేరుకోగా, ఓటమితో ఆస్ట్రేలియా 69.23 పీసీటీతో మూడో స్థానానికి పరిమితమైంది. మరోవైపు, వెస్టిండీస్‌తో జరిగిన టెస్టులో బంగ్లాదేశ్ ఓడిపోవడం భారత్‌కు అనుకూలించింది. ఈ మ్యాచ్‌కు ముందు 55.56 పీసీటీతో నాలుగో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్, ఓటమితో 47.62 పీసీటీకి పడిపోయింది. దీంతో 51.52 పీసీటీతో ఐదో స్థానంలో ఉన్న టీమిండియా, బంగ్లాను అధిగమించి నాలుగో స్థానానికి చేరుకుంది. ఈ తాజా ఫలితాలతో డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు మరింత ఆసక్తికరంగా మారింది. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు వచ్చే ఏడాది ఓవల్ మైదానంలో జరిగే ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

ట్రై సిరీస్ ఫైనల్లో పాక్ థ్రిల్లింగ్ విన్

భారత్ 24 ఏళ్ల నాటి ప్రపంచ రికార్డు సమం



లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియంలో శనివారం జరిగిన వన్డే ట్రై సిరీస్ ఫైనల్లో పాకిస్థాన్ అద్భుత విజయం సాధించింది. ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో శ్రీలంకపై మూడు వికెట్ల తేడాతో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ విజయంతో పాకిస్థాన్ ఓ అరుదైన ప్రపంచ రికార్డును సమం చేసింది. వన్డే టోర్నమెంట్ ఫైనల్స్‌లో అత్యధిక లక్ష్య ఛేదన రికార్డును భారత్‌తో పంచుకుంది. 2002లో లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌పై భారత్ 326 పరుగుల లక్ష్యాన్ని ఛేదించగా, సరిగ్గా 24 ఏళ్ల తర్వాత పాకిస్థాన్ కూడా అంతే స్కోరును ఛేదించి చరిత్ర సృష్టించింది. ఈ మ్యాచ్‌లో ఫకర్ జమాన్ (127) ఆకాశమే హద్దుగా చెలరేగి పాక్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 326 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ ఆరంభంలో తడబడింది. 14 పరుగులకే మాజీ సదాఖత్ (5), కెప్టెన్ బాబర్ ఆజం (0) వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఫకర్ జమాన్, వికెట్ కీపర్ సాద్ బేగ్ (74)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 149 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును ఆదుకున్నారు. సాద్ బేగ్ ఔటైన తర్వాత కూడా ఫకర్ జమాన్ తన జోరు కొనసాగించాడు. కేవలం 99 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సర్లతో 127 పరుగులు చేసి వన్డే ఫైనల్స్‌లో రెండు సెంచరీలు చేసిన రెండో పాక్ బ్యాటర్‌గా నిలిచాడు. జమాన్ ఔటయ్యాక శ్రీలంక మళ్లీ మ్యాచ్‌పై పట్టు బిగించే ప్రయత్నం చేసింది. అయితే, ఆరో వికెట్‌కు హసన్ నవాజ్ (37నాటౌట్), అరాఫత్ మిన్హాస్ జతకలిసి కేవలం 50 బంతుల్లోనే 94 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ముఖ్యంగా అరాఫత్ మిన్హాస్ కేవలం 31 బంతుల్లో 4 సిక్సర్లు, 3 ఫోర్లతో 61 పరుగులు చేసి మ్యాచ్‌ను పూర్తిగా పాకిస్థాన్ వైపు తిప్పాడు. చివరి ఓవర్లో ఉత్కంఠ నెలకొన్నప్పటికీ, కెప్టెన్ షాహీన్ అఫ్రిది సిక్సర్ బాది మరో 9 బంతులు మిగిలి ఉండగానే జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. అంతకుముందు కమిందు మెండిస్ (100) సెంచరీతో శ్రీలంక 50 ఓవర్లలో 325/8 స్కోరు చేసింది.

ఇషాన్ కిషన్ అరుదైన ఘనత

సూర్యకుమార్ రికార్డు తెరమరుగు!



టీమిండియా యువ వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ అరుదైన ఘనత సాధించాడు. అంతర్జాతీయ టీ20ల్లో ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. న్యూజిలాండ్‌తో ఆదివారం జరిగిన ఐదో టీ20లో ఈ ఘనత అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 32 బంతుల్లో 61 పరుగులు చేసి జట్టు స్కోరు పెరగడంలో కీలక పాత్ర పోషించాడు.

సూర్యకుమార్ రికార్డు బద్దలు

2022లో టీమిండియా మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 31 ఇన్నింగ్స్‌ల్లో 1,164 పరుగులు చేశాడు. ఇప్పటివరకు ఇదే భారత రికార్డుగా ఉంది. ఇషాన్ ఈ ఏడాది 37 ఇన్నింగ్స్‌ల్లో 1,220 పరుగులు చేసి ఆ రికార్డును అధిగమించాడు. ఐదో టీ20కి ముందు అతడి ఖాతాలో 1,159 పరుగులు ఉన్నాయి. సూర్య రికార్డును అధిగమించడానికి మరో ఆరు పరుగులు అవసరం కాగా.. ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఆ మైలురాయిని చేరుకున్నాడు.

ప్రపంచ జాబితాలో నాలుగో స్థానం

ఒక క్యాలెండర్ ఏడాదిలో టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో ఇషాన్ ప్రస్తుతం నాలుగో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రియా ఆటగాడు కరణ్‌బీర్ సింగ్ 1,488 పరుగులతో అగ్రస్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్ ఆటగాడు మహ్మద్ రిజ్వాన్ 1,326 పరుగులతో రెండో స్థానంలో, బహ్రెయిన్ ఆటగాడు ఫయాజ్ అహ్మద్ 1,251 పరుగులతో మూడో స్థానంలో ఉన్నారు. టెస్టు హోదా కలిగిన దేశాల ఆటగాళ్లలో ఇషాన్ రెండో స్థానంలో నిలిచాడు.

2 వేల పరుగుల మైలురాయి

ఇదే మ్యాచ్‌లో ఇషాన్ అంతర్జాతీయ టీ20ల్లో 2 వేల పరుగుల మైలురాయిని కూడా అందుకున్నాడు. బంతుల పరంగా ఈ ఘనత సాధించిన మూడో వేగవంతమైన భారత ఆటగాడిగా నిలిచాడు. ఇషాన్ 1,345 బంతుల్లో ఈ పరుగులు పూర్తి చేశాడు. అభిషేక్ శర్మ 1,024 బంతుల్లో, సూర్యకుమార్ యాదవ్ 1,164 బంతుల్లో ఈ మైలురాయిని చేరుకున్నారు.

గాయాన్ని అధిగమించి మెరుపులు

ఈ సిరీస్‌లో ఇషాన్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో లేదు. ఆడిన తొలి మ్యాచ్‌లో ఒక పరుగు, నాలుగో టీ20లో సున్నాకే వెనుదిరిగాడు. కుడి తొడ కండరాల గాయంతో మధ్యలో రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే చివరి మ్యాచ్‌లో అర్ధశతకంతో మెరిసి రెండు కీలక రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు.




శ్రీలీల పచ్చ కోక వైబ్స్.. అభిమానుల హంగామా పీక్స్!

దక్షిణాది చిత్రసీమలో తనదైన అద్భుత నటన, గ్రేస్‌ఫుల్ డాన్స్‌తో స్వల్ప వ్యవధిలోనే అపారమైన క్రేజ్ సంపాదించుకున్న నటి శ్రీలీల. సోషల్ మీడియాలో ఈ బ్యూటీ హంగామా అంతా ఇంతా కాదు. లీల ఏ కొత్త పోస్ట్ షేర్ చేసినా అది క్షణాల్లో వైరల్ అవ్వడం సహజమే. తాజాగా ఈ డ్యాన్సింగ్ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలకు కూడా నెటిజన్ల నుండి ఊహించని రీతిలో రెస్పాన్స్ వచ్చింది. ఆ పచ్చ రంగు కోకలో లీల అదుర్స్! అంటూ ఫ్యాన్స్ జోరుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కామెంట్స్ విభాగాన్ని పరిశీలిస్తే... శ్రీలీలపై అభిమానులకు ఉన్న అపరిమితమైన ప్రేమ, అభినందనలు స్పష్టంగా కనిపిస్తాయి. మెజారిటీ కామెంట్లు హార్ట్, ఫైర్ ఎమోజీలతో నిండిపోగా.. సాధారణ అభిమానులతో పాటు సినీ ఇండస్ట్రీకి చెందిన తోటి నటీనటులు (రాశీ ఖన్నా వంటివారు) కూడా తన రూపాన్ని మెచ్చుకుంటూ అప్సరస, ఏంజెల్ అని ప్రశంసల వర్షం కురిపించారు. ఈ సోషల్ మీడియా హంగామాలో ప్రధానంగా శ్రీలీల ధరించిన సాంప్రదాయ ఆకుపచ్చ రంగు చీర.. ఇటీవలి తుమకూరు పర్యటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అందాల భరిణె కట్టు బొట్టును పాగుడుతూ అభిమానులు మురిసిపోయారు. కర్ణాటకలోని తుమకూరులో ఒక ప్రైవేట్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ ఈవెంట్ కోసం శ్రీలీల హాజరవగా.. తనను స్వయంగా చూడటానికి ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అక్కడ శ్రీలీల కనిపించిన తీరు .. ఆ ఫోటోలను సోషల్ మీడియాలో -తుముకూరు వైబ్స్- పేరుతో విపరీతంగా వైరల్ అయ్యాయి. ఇదే క్రమంలో కొందరు ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు కూడా తెలిపారు. కేవలం అందాన్ని పాగడటమే కాకుండా శ్రీలీల సినీ కెరీర్‌పై ఉన్న అభిమానంతో కొందరు నెటిజన్లు అత్యంత కీలకమైన సూచనలు చేశారు. మళ్లీ కన్నడ చిత్రసీమలో సినిమాలు చేసి అలరించాలని స్థానిక అభిమానులు ఆకాంక్షించగా.. మరికొందరు మాత్రం కేవలం వరుస సినిమాలు ఒప్పుకుంటూ పోవడం కంటే.. మంచి స్క్రీన్ టైమ్, కథలో ప్రాధాన్యత ఉన్న వైవిధ్యమైన పాత్రలను ఎంచుకోవాలని హితవు పలికారు. అభిమానుల ఈ సలహాలు తన కెరీర్ విషయంలో ఫ్యాన్స్ కు ఉన్న బాధ్యతను, శ్రీలీల భవిష్యత్తుపై వారికి ఉన్న ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయి.

పోస్టర్‌తోనే సుక్కూ మాస్టర్ స్ట్రోక్ ఆ లెవల్లో!

నెమలి పించం.. పొడవాటి గిరజాల జుట్టు.. గుబురు గడ్డం.. ఆ మూడింటిని మెర్జ్ చేసిన పోస్టర్.. లాంచింగ్ డే ఈ సరికొత్త ట్విస్టేంటి? మాస్టర్ మైండ్ సుకుమార్ క్రియేటివిటీ పీక్స్ లో వికశించింది! ఆర్.సి 17 పోస్టర్ ని విశ్లేషిస్తే అదీ సంగతి.. -రంగస్థలం- వంటి బ్లాక్ బస్టర్ తర్వాత మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ – సుకుమార్ కలయికలో సినిమా గురించి అభిమానులు ఉత్కంఠగా వేచి చూస్తున్న సంగతి తెలిసిందే. అన్నిటికీ తెర దించుతూ నేడు =జ17 పూజా కార్యక్రమాలతో హైదరాబాద్ లో గ్రాండ్ గా ప్రారంభమైన విషయం తెలిసిందే. మెగాస్టార్ అతిథిగా సినిమాని లాంచ్ చేయగా చిత్రబృందం పాల్గొంది. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తే సుకుమార్ లోని క్రియేటివిటీ – కళాత్మక పంథా స్పష్టంగా అర్థమవుతోంది. నెమలి పించం.. పొడవాటి గిరజాల జుట్టు.. గుబురు గడ్డం..ఈ మూడింటినీ అత్యంత ప్రతిభావంతంగా మెర్జ్ చేస్తూ రూపొందించిన ఈ డిజైనర్ లుక్ సుక్కూ విజన్‌కు అద్దం పడుతోంది. నీలం, ఆకుపచ్చ, బంగారు రంగుల కుంచెల టచ్ తో నెమలి పించం ఆకారంలో రామ్ చరణ్ ప్రొఫైల్‌ను మెర్జ్ చేస్తూ తెచ్చిన ఈ ఆర్టిస్టిక్ ప్రీ-లుక్ కేవలం ఒక క్రియేటివ్ లుక్ మాత్రమే కాదు.. ఈ సినిమా కథానాయకుడు ఎలా కనిపిస్తాడు? కథలో ఇంటెన్స్ టోన్ ఎలా ఉండబోతోందో హింట్ ఇస్తోంది. దీనికి జోడించిన -యు కెన్ ఇమాజిన్- అనే ట్యాగ్‌లైన్ అభిమానుల ఊహలకు, అంచనాలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఒక ఊహాతీతమైన, కొత్త సినిమాటిక్ ప్రపంచాన్ని సుకుమార్ ఆవిష్కరించబోతున్నారనే గొప్ప కుతూహలాన్ని పెంచుతోంది. ఒక చిన్న విజువల్ ఎలిమెంట్‌తో కథలోని అంతరార్థాన్ని, హీరో పాత్రలోని ప్రత్యేకతను ప్రతిబింబించేలా చేయడం సుకుమార్‌కు మాత్రమే చెల్లిన ప్రత్యేక విద్య. ఈ పోస్టర్ చూడగానే ఆయన ఆలోచనా విధానాన్ని, పోస్టర్ డిజైనింగ్‌లో అతడు చూపించిన సృజనాత్మక శైలిని ప్రశంసించకుండా ఉండలేము.



డర్టీభామ మరో రెండు సౌత్ సినిమాల్లో!



దక్షిణాది చిత్రసీమలో ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్న నటి విద్యాబాలన్ తమిళ పరిశ్రమలో మోస్ట్ వాంటెడ్ ఆర్టిస్ట్‌గా మారిపోతున్నారు. ఇటీవల విడుదలైన సూపర్‌స్టార్ రజనీకాంత్ చిత్రం -జైలర్ 2-లో నటనతో ఆకట్టుకున్న సీనియర్ బ్యూటీ కి కోలీవుడ్ నుంచి వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న విద్య కోలీవుడ్‌లోని ప్రముఖ దర్శకులు ... అగ్ర కథానాయకుల ప్రాజెక్ట్‌లలో కీలక పాత్రలు దక్కించుకుంటూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారుతున్నారు. -జైలర్ 2- సాధించిన భారీ విజయం డర్టీభామ కెరీర్‌కు ఊహించని మైలేజ్‌ను అందించింది. ఆ చిత్రంలో విద్య కనిపించిన విధానం .. పాత్రలోని తీరు తెన్నులు తమిళ ప్రేక్షకులను మెప్పించాయి. పెద్ద బ్యానర్ల నుంచి వస్తున్న అవకాశాలను అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తూ కెరీర్‌కు ప్లస్ అయ్యే వైవిధ్యమైన పాత్రలను మాత్రమే విద్య ఎంపిక చేసు కుంటున్నారు. ఈ నేపథ్యంలోనే హిందీ దర్శకుడు ఆర్ బాల్కీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రత్యేక తమిళ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆర్ బాల్కీ చిత్రాల్లో నటీనటుల పాత్రలు వినూత్నంగా, మానవీయ సంబంధాలకు అద్దం పట్టేలా ఉంటాయి. అలాంటి విలక్షణ దర్శకుడి క్రాఫ్ట్‌లో భాగం కావడం విద్యాబాలన్ నటనలో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుందని చెప్పొచ్చు. ఇందులో విద్య పాత్రకు సంబంధించిన విషయాలను యూనిట్ గోప్యంగా ఉంచింది. అయితే ఈ సినిమా ద్వారా కోలీవుడ్‌లో విద్య స్థానం మరింత పటిష్టం కావడం ఖాయమని తెలుస్తోంది. అలాగే కోలీవుడ్ మీడియాలో విద్య తదుపరి ప్రాజెక్ట్‌లపై ఓ సంచలన ప్రచారం నడుస్తోంది. తమిళ ఇండస్ట్రీలో వరుస విజయాలతో దూసుకుపోతున్న స్టార్ హీరోలు కార్తీ .. శివకార్తికేయన్ కొత్త చిత్రాలలో కీలక పాత్రలో నటించేందుకు సంతకం చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇద్దరు హీరోలకు తమిళంతో పాటు తెలుగులోనూ భారీ మార్కెట్ ఉన్న నేపథ్యంలో ఈ సినిమాల్లో నటించేందుకు విద్య ఆసక్తిగా ఉందని తెలుస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన అధికారిక ప్రకటనలు త్వరలోనే రానున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రచారం గనుక నిజమైతే రాబోయే రోజుల్లో డర్టీభామ కోలీవుడ్‌లో బిజీయెస్ట్ నటిగా మారడం ఖాయం. ప్రస్తుతం విద్యా బాలన్ బాలీవుడ్ కెరీర్ ఏమంత బిజీగా లేదు. అవకాశాలు వస్తే సద్వినియోగం చేసుకుంటుంది. అలాగని ప్రాధాన్యత లేని పాత్రలకు ఒకే చెప్పడం లేదు. పాత్రల విషయంలో చాలా సెలక్టివ్ గా ఉంటుంది. ఏ సినిమా చేసినా? అందులో విద్య పాత్ర హైలైట్ గా ఉంటుందంటేనే కమిట్ అవుతుంది. లేదంటే నిర్మొహ మాటంగా నో చెబుతుంది.

వైట్ గ్లామర్‌తో మాళవిక మోహనన్.. చూపు తిప్పుకోలేరు!

సౌత్ ఇండియన్ గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ తన అందచందాలతో, స్టైలిష్ ఫొటోషూట్‌లతో ఎప్పుడూ సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తుంటారు. తాజాగా ఆమె వైట్ కలర్ అనార్కలీ డ్రెస్‌లో షేర్ చేసిన ఎలిగెంట్ పిక్స్ ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తున్నాయి. రాయల్ లుక్, క్లాసిక్ వింటేజ్ వైబ్‌తో కూడిన ఈ ఫొటోల్లో మాళవికను చూసిన నెటిజన్లు చూపు తిప్పుకోలేకపోతున్నారు. ఎంతో ప్రశాంతంగా, పొయెటిక్‌గా ఉన్న ఆ సినిమాటిక్ ఫొటోషూట్ విశేషాలు ఇప్పుడు చూద్దాం.. తాజా ఫొటోషూట్‌లో మాళవిక మోహనన్ ఒక కలర్‌ఫుల్ అండ్ రాయల్ వైట్ అనార్కలీ అవుట్‌ఫిట్‌లో మెరిసిపోయారు. పారదర్శకమైన షీర్ దుపట్టా, బాడీస్‌పై నాజూకైన పూల ఎంబ్రాయిడరీ మరియు సీక్విన్ వర్క్‌తో ఈ డ్రెస్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. ఇక దీనికి తోడు ఆమె ధరించిన పెద్ద వెండి జుంకాలు, చేతికి ఉన్న సింపుల్ రింగ్స్ ఆమె సాంప్రదాయక అందానికి మరిన్ని మెరుగులు దిద్దాయి. పుస్తకాల షెల్ఫ్‌లు, వెచ్చని దీపాల కాంతి ఉన్న ఒక ఇండోర్ లొకేషన్‌లో ఈ ఫొటోలను షూట్ చేశారు. స్మోకీ ఐస్, నేచురల్ మేకప్, లూజ్ హెయిర్‌తో మాళవిక ఇచ్చిన రాయల్ ఫోజులు ఏదో ఒక సినిమాలోని సీన్‌ను తలపిస్తున్నాయి. ప్రశాంతమైన వాతావరణంలో క్లోజప్ క్లిక్స్ నుండి లగ్జరీ సీటింగ్ పిక్స్ వరకు ప్రతీ ఫ్రేమ్‌లోనూ మాళవిక తనదైన రాయల్ ఎక్స్‌ప్రెషన్లతో ఆకట్టుకున్నారు.



Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA